రైతులకు 'భరోసా' వస్తోంది. వానాకాలం పంటకు పెట్టుబడి సాయంగా అన్నదాతలకు అందించే సొమ్ములను ప్రభుత్వం ట్రెజరీల్లో జమ చేసింది. ఈ రైతు రైతుభరోసా కార్యక్రమానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సోమవారం హైదరాబాద్ రాజేంద్రనగర్‌లో శ్రీకారం చుట్టారు. రైతు ఆశీర్వాదంతోనే ప్రభుత్వం ముందుకెళుతోందని, రైతు సంక్షేమమే తమ ప్రభుత్వ ధ్యేయమని ఆయన ప్రకటించారు. ఈ క్రమంలోనే రైతులకు పెట్టుబడి భారం తగ్గించేలా రూపకల్పన చేసిన రైతుభరోసా పథకం కింద రాష్ట్ర వ్యాప్తంగా రూ.9వేలకోట్లను 9 రోజుల్లో అర్హులైన రైతుల ఖాతాల్లో జమచేస్తామని ప్రకటించారు. దీంతో ఉమ్మడి ఖమ్మం జిల్లా రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



'భరోసా' వస్తోంది..

- రైతులకు అందుతున్న వానాకాలం పెట్టుబడి సాయం
- తొమ్మిది రోజుల్లో అన్నదాతలందరికీ అందించనున్న ప్రభుత్వం
- తొలిరోజు అందించే సొమ్ములు జిల్లా ట్రెజరీల్లో జమ

ఖమ్మం, జూన్ 16 (ఆంధ్రజ్యోతిప్రతినిధి): రైతు భరోసా కింద ఎకరానికి రూ.6వేల చొప్పున సాగు సాయం జమకానున్నాయి. ఈ క్రమంలో తొలిరోజున రైతు భరోసా అందించేందుకు గాను అవసరమైన నిధులను ఆయా జిల్లాల ట్రెజరీల్లో జమచేశారు. ఖమ్మం జిల్లా పరిధిలో 3,53,794 మంది రైతులకు రూ.436.84 కోట్లు కావాల్సి ఉండగా.. సోమవారం 2,88,387 మంది రైతులకు సంబంధించి రూ.250.84కోట్లను ట్రెజరీలో జమచేశారు. తద్వారా సుమారు 7.25లక్షల ఎకరాలకుపైగా రైతు భరోసా అందనుంది. అలాగే భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 1,87,639మంది రైతులకు రూ.331.97కోట్లు రైతుభరోసా అవసరం కానుండగా.. తొలిరోజు 1,13,416మంది రైతులకు అందించేందుకు రూ.102.15కోట్లు ట్రెజరీలో జమయ్యాయి. ఇక్కడ సుమారు 5.51లక్షల ఎకరాలకుపైగా రైతు భరోసా దక్కనుంది. ప్రస్తుతం ఉమ్మడిజిల్లాలో పత్తి, వరి, మొక్కజొన్న, కంది పెసరతోపాటు మిర్చి నారుమళ్లు ఇతర వాణిజ్య, ఆహార పప్పుదినుసులపంటలు సాగుకు రైతులు సర్వం సిద్ధం చేసుకున్నారు. విత్తనాలు, ఎరువులు కొనే దశలో ఉన్నారు. ఈతరుణంలో ప్రభుత్వం రైతుభరోసా కింద పెట్టుబడి సొమ్ము వేస్తుండడంతో రైతుల్లో ఆనందం వ్యక్తమవుతోంది.

మళ్లీ రంగంలోకి ఆదర్శ రైతులు

రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయ పంటల సాగులో అనుభవం ఉన్న రైతులను ఆదర్శరైతులుగా గుర్తించి రైతుసదస్సుల్లో పాల్గొనేందుకు అవకాశం కల్పించబోతోంది. సీఎం రేవంత్‌రెడ్డి రైతుభరోసా పంపిణీ కార్యక్రమ ప్రారంభ సభలో ప్రసంగిస్తూ ఆయాపంటల సాగులో, భూసార పరిరక్షణలో సాంకేతిక పరిజ్ఞానం వినియోగించడంలో అనుభవం ఉన్న రైతులు తమ అనుభవాలను మిగిలిన రైతులకు తెలిపేందుకు రైతుసదస్సుల్లో అవకాశం కల్పిస్తున్నట్టు ప్రకటించారు. అలాగే వ్యవసాయసాగుకు అవసరమైన సాంకేతిక పనిముట్లను మళ్లీ రైతులకు అందించబోతున్నారు. స్ప్రింక్లర్లు, ట్రాక్టర్లు, పవర్ స్ప్రేయర్లు, డ్రోన్ స్ప్రేయర్లతో పాటు కలుపు నివారణ యంత్రాలు, ఇతర వ్యవసాయ పనిముట్లు కూడా రైతులకు ఇకపై అందించేందుకు ప్రభుత్వం నిర్ణయించినట్టు ముఖ్యమంత్రి ప్రకటించడంతో తిరిగి వ్యవసాయ యాంత్రీకరణ పథకం రైతులకు అందనుంది.

జిల్లా	మొత్తం రైతులు	కావాల్సిన నిధులు	ట్రెజరీలో జమైనవి	తొలుత అందే రైతులు
ఖమ్మం	3,53,794	రూ.436.84కోట్లు	రూ.250.84కోట్లు	2,88,387
భద్రాద్రి	1,87639	రూ.331.97కోటు	రూ.102.15కోట్లు	1,13,416



అయ్యా రామకృష్ణ గారూ..
అన్నీ ఖమ్మానికే ఇచ్చా!
- జాగ్రత్తగా చూసుకోండి
- ఆదర్శ రైతుతో ముఖ్యమంత్రి ఆసక్తికర సంభాషణ

రైతువేదిక నుంచి వీడియో కాన్ఫరెన్సు ద్వారా ముఖ్యమంత్రితో మాట్లాడుతున్న ఆదర్శ రైతు మంకెన రామకృష్ణ

7

అంచనాలు మార్చాలిందే..

గోదావరి వరదల విశ్లేషణకు చుక్కాని 'ఫ్లడ్ మాన్యువల్'

- 41 ఏళ్ల క్రితం తొలిసారిగా రూపకల్పన
- పోలవరం బ్యాక్ వాటర్ ప్రభావంతో మాన్యువల్ నవీకరణ అత్యవసరం
- ఇప్పటి వరకు రెండుసార్లు నవీకరణ

భద్రాచలం, జూన్ 16(ఆంధ్రజ్యోతి): గోదావరి పరివాహక ప్రాంతంలో వరదల తీవ్రతను అంచనా వేసేందుకు గోదావరి 'వరద మాన్యువల్' ఒక విశ్లేషణిగా నిలుస్తోంది. ఈ ప్రాంతంలో వరదల తీవ్రత, ప్రభావం, ముందస్తుగా నిత్యవసర సరుకులు ఎక్కడ నిల్వ చేయాలి, తాత్కాలిక హెలిప్యాడ్‌లు సిద్ధం చేయడం తదితర కీలక అంశాలను నూతనంగా వచ్చిన అధికారులు సైతం అవలీలగా అవగాహన చేసుకునేందుకు ఇది ఎంతో ఉపకరిస్తుంది. అధికారికంగా అందుబాటులో ఉన్న రికార్డుల ప్రకారం 1953నుంచి గోదావరి వరద గణాంకాలు ఉన్నాయి. ఈ రికార్డుల ప్రకారం 1986 ఆగస్టు 16న భద్రాచలంలో నమోదైన 75.6 అడుగుల నీటిమట్టం ఇప్పటివరకు అత్యధిక నీటిమట్టంగా నమోదైంది. ఎన్ని అడుగుల వద్ద ఎన్ని క్యూసెక్కుల నీరు కిందకు ప్రవహిస్తుందనే సమగ్ర సమాచారం ఇందులో పొందుపర్చబడింది. ఆ సమయంలో ఏ గ్రామాలు ముంపునకు గురయ్యాయి ఎంత మంది నిర్వాసితులు పునరావాస కేంద్రాలకు చేరారు. సహాయక చర్యలు, పంట నష్టం తదితర అంశాలు ఇందులో పొందుపరిచారు. కాగా ఏపీలో పోలవరం ప్రాజెక్టు నిర్మాణం నేపథ్యంలో ఈ ఫ్లడ్ మాన్యువల్ అంచనాలు భవిష్యత్‌లో ఉపయోగపడే అవకాశం లేదు. పోలవరం ప్రాజెక్టు నిర్మాణం పూర్తికాక ముందే బ్యాక్ వాటర్ ప్రభావం భద్రాచలం, బూర్గంపాడు వాటి పరిసర ప్రాంతాలపై స్పష్టంగా కనిపిస్తోంది. ఫలితంగా గతంలో రూపొందించిన గోదావరి వరద మాన్యువల్‌ను నవీకరణ చేయాలనే ప్రతిపాదన తెరపైకి వస్తోంది. ప్రస్తుత పరిస్థితుల్లో ఇది ఎంతో అవసరమన్న అభిప్రాయాలు వినిపిస్తున్నాయి.



భద్రాచలం వద్ద వరద గోదావరి (ఫైల్)

గోదావరి ఫ్లడ్ మాన్యువల్

41 ఏళ్ల క్రితం తొలిసారిగా రూపకల్పన

గోదావరి వరద మాన్యువల్‌ను 41 ఏళ్ల క్రితం తొలిసారిగా రూపొందించారు. 1984లో తొలిసారిగా అప్పటి అధికార యంత్రాంగం ఇందుకు శ్రీకారం చుట్టింది. తొలినాళ్లలో గోదావరి ఫ్లడ్ స్కీం పేరిట దీన్ని రూపొందించారు. అనంతరం 1986 ఆగస్టు 16న వచ్చిన 75.6 అడుగుల నీటిమట్టం భద్రాద్రి చరిత్రలోనే అత్యధికం కావడంతో దాని ఆధారంగా అధికారులు తొలిసారిగా 1987లో మార్పులు చేశారు. 1986 గోదావరి వరదలను బెంచ్ మార్కుగా గుర్తించి 1990, 1994, 1995, 1998, 2000, 2002, 2006లో వచ్చిన వరదలను పరిగణలోకి తీసుకొని 2007లో రెండోసారి గోదావరి మాన్యువల్‌ను నవీకరణ చేశారు.

పోలవరం బ్యాక్ వాటర్ నేపథ్యంలో మార్పు అనివార్యం..

పోలవరం బ్యాక్ వాటర్‌తో ప్రమాదం పొంచి ఉన్న నేపథ్యంలో భద్రాచలం వద్ద గోదావరి నదీ పరివాహక ప్రాంతవాసులకు (మిగతా 6వ పేజీలో)

సింగరేణి డైరెక్టర్(పా)గా
గౌతమ్ పోట్రు బాధ్యతల స్వీకరణ

స్వాగతం పలికిన అధికారులు, యూనియన్ నాయకులు

కొత్తగూడెం, జూన్ 16(ఆంధ్రజ్యోతి): సింగరేణి డైరెక్టర్ పర్సనల్, అడ్మినిస్ట్రేషన్ అండ్ వెల్ఫేర్ (పా)గా నియమితులైన గౌతమ్ పోట్రు సోమవారం కొత్తగూడెంలోని సింగరేణి ప్రధాన కార్యాలయంలో డైరెక్టర్(పా) చాంబర్‌లో బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా సింగరేణిలో పని చేస్తున్న డైరెక్టర్లు, సింగరేణి ఉన్నతాధికారులు, గుర్తింపు కార్మికసంఘం నాయకులు ఆయనకు ఘనంగా స్వాగతం పలికారు. సంస్థ డైరెక్టర్ (ఆపరేషన్స్) ఎల్‌వి. సూర్యనారాయణ, డైరెక్టర్ (పీపీ) కే. వెంకటేశ్వర్లు, అన్నిశాఖల జనరల్ మేనేజర్లు, అధికారులు, యూనియన్ నాయకులు, ఉద్యోగులు గౌతమ్ పోట్రుని కలిసి పుష్పగుచ్ఛాలు అందచేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం గౌతమ్ పోట్రు పర్సనల్ డిపార్టుమెంట్ జనరల్ మేనేజర్ కవితానాయుడు, ఐఆర్, పీఎం వింగ్, ఈఆర్‌పీ, సూపర్‌బజారుల అధికారులతో డిపార్ట్‌మెంట్ వారీగా వారు నిర్వర్తించే పనులపై సమీక్షించారు. ఈ కార్యక్రమంలో జీఎం (పర్సనల్) ఐఆర్ పీఎం కవితానాయుడు, జీఎం (పర్సనల్) ఆర్‌సీ బెనడిక్ట్ నికోలస్, జీఎం (పర్సనల్) జీవి. కిరణ్ కుమార్, హెచ్‌వోడీ ఈఈ సెల్ ఎండి సూపర్‌బజారు ఏజీఎం మురళీధర్, ఏజీఎం (పర్సనల్) పీఎంవింగ్ జి. రాజేంద్ర ప్రసద్, డీజీఎం(పర్సనల్) ఐఆర్ వింగ్ అజయ్‌కుమార్, డీజీఎం(పర్సనల్) వైవిఎల్. వరప్రసాద్, ఎస్. వెంకటేశ్వరరావు, బి. రాజగోపాల్, పర్సనల్ డిపార్టుమెంట్ అధికారులు పాల్గొన్నారు.



గౌతమ్ పోట్రుకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న సీజీఎం పర్సనల్ కవితానాయుడు

డైరెక్టర్ (పా)ను కలిసిన సింగరేణి గుర్తింపు సంఘం ఏటీయూసీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించి బొకేను అందచేశారు. సింగరేణి కంపెనీ అభివృద్ధికి పాటుపడాలని కోరారు. కార్యక్రమంలో సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు వాసిరెడ్డి సీతారామయ్య, జనరల్ సెక్రటరీ కే. రాజ్‌కుమార్, అదనపు జనరల్ సెక్రటరీ మిర్యాల రంగయ్య, డిప్యూటీ జనరల్ సెక్రటరీలు కే. సారయ్య, వైవి. రావు, ఎం. సమ్మయ్య, కే. వీరభద్రయ్య, వంగా వెంకట్, రాంగోపాల్, రమణమూర్తి, కిష్టాఫర్, సామల రాము, నాగయ్య, అసంఘటిత రంగం కొత్తగూడెం రీజియన్ ఇంచార్జ్ యర్రంగాని కృష్ణయ్య, కిషోర్ తదితరులు ఉన్నారు.

సింగరేణి అధికారుల
పోరుబాట
- పీఆర్‌పీల కోసం ఏళ్ల తరబడి ఎదురుచూపులు
- లాభాల సింగరేణిలో అధికారులపై వివక్ష
- దశలవారీ ఆందోళనలకు అధికారుల సంఘం పిలుపు

6

ఇసుక ర్యాంపుల బాధ్యత
మహిళా సొసైటీలదే
- పైలెట్ ప్రాజెక్టు కింద రెండు ఇసుక సొసైటీల ఎంపిక
- మహిళలందరికీ తగిన శిక్షణ
- భద్రాచలం ఐటీడీఏ పీవో రాహుల్

6




గువ్వలగూడెంలో సీసీరోడ్డుకు శంకుస్థాపన చేస్తున్న మంత్రి పొంగులేటి

ఇందిరమ్మ ప్రభుత్వంలో
అభివృద్ధి పరుగులు

- ప్రజల కోసమే రేవంత్ సర్కారు పనిచేస్తోంది
- రాష్ట్రం అప్పుల్లో ఉన్నా.. సంక్షేమం ఆగటం లేదు
- గత పాలకులు పదేళ్లలో రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చారు
- నేలకొండపల్లి మండల పర్యటనలో మంత్రి పొంగులేటి

నేలకొండపల్లి, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ప్రభుత్వంలో అభివృద్ధి పరుగులు పెండుతోందని, రేవంత్ నేతృత్వంలోని తమ సర్కారు ప్రజల సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తోందని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. సోమవారం నేలకొండపల్లి మండలంలోని గువ్వలగూడెం, కోరట్లగూడెం, మూటాపురం గ్రామాల్లో పర్యటించిన (మిగతా 6వ పేజీలో)

'కిన్నెరసాని'కి
ప్రత్యేక నిధులు



- ప్రాజెక్టు పటిష్టానికి రూ.1.90కోట్లు మంజూరు
- పరిశీలనకు త్వరలో నిపుణుల బృందం రాక
- పలు మరమ్మతు పనులకు మరో రూ.కోటి20లక్షలు

పాల్వంచ రూరల్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి) : కిన్నెరసాని ప్రాజెక్టు పటిష్టత, మరమ్మతు పనులకు తెలంగాణ జెన్కో సంస్థ ప్రత్యేక నిధులను మంజూరు చేసింది. ముఖ్యంగా ప్రాజెక్టు పటిష్టతపై దృష్టి పెట్టిన సంస్థ రూ. 1.90కోట్లు మంజూరు చేసినట్టు కొత్తగూడెం థర్మల్ పవర్ స్టేషన్ (కేటీపీఎస్) ప్రాజెక్టు అధికారులు వెల్లడించారు. ఈ క్రమంలో ప్రాజెక్టు పటిష్టతకు చేపట్టాల్సిన పనులు, అనుసరించాల్సిన పద్ధతులపై అధ్యయనం చేసేందుకు సెంట్రల్ వాటర్ పవర్ రిసెర్చ్ బృందం త్వరలోనే రానుంది. పాల్వంచ మండలంలోని కిన్నెరసాని జలాశయాన్ని 1960లో నిర్మించారు. ఈ ప్రాజెక్టు నీటిని విద్యుత్ ఉత్పత్తితోపాటు 10వేల ఎకరాల సాగుకు వినియోగిస్తున్నారు. సుమారు 65ఏళ్ల క్రితం నిర్మించిన ఈ ప్రాజెక్టు ప్రతిష్ఠతపై పుణెకు చెందిన నిపుణుల బృందం వచ్చి సమగ్ర పరిశీలనచేయనుంది. 515 చదరపు మైళ్ల విస్తీర్ణం, 39మీటర్ల ఎత్తులో, 8టీఎంసీల సామర్థ్యం, 13 గేట్లతో నిర్మాణమైన ఈ జలాశయం.. 407అడుగుల మేరకు నీటిని నిల్వ చేస్తారు. ఆ పై జలాలను విడుదల చేస్తుంటారు. సుమారు 2లక్షల క్యూసెక్కుల నీటిని దిగువ ప్రాంతాలకు విడుదల చేసే సామర్థ్యం ఉంది. గతేడాది ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటిమట్టానికి చేరడంతో లక్ష10వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. అలా విడుదల చేసిన నీరు 20కిలోమీటర్లు ప్రయాణించి గోదావరిలో కలుస్తుంది. అయితే ఎన్నో ఏళ్ల క్రితం నిర్మించిన ఈ ప్రాజెక్టు పటిష్ఠతపై దృష్టి పెట్టిన కేంద్ర జలవనరుల శాఖ ఇచ్చిన ఆదేశాలతో జెన్కో సంస్థ ప్రత్యేక నిపుణులతో సమగ్ర పరిశీలన చేయించనుంది. ఈ క్రమంలో పరిశీలన బృందం త్వరలోనే కిన్నెరసాని ప్రాజెక్టును పరిశీలించి నివేదికను జెన్కోకు అప్పగించనుంది. ఇందుకు గాను ఇప్పటికే (మిగతా 6వ పేజీలో)



మాట్లాడుతున్న ఐటీడీఏ పీవో రాహుల్

ఇసుక ర్యాంపుల బాధ్యత
మహిళా సొసైటీలదే

భద్రాచలం ఐటీడీఏ పీవో రాహుల్

భద్రాచలం, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): ఆదివాసీ గిరిజన మహిళలు సొంతంగా ఇసుక ర్యాంపులు నడుపుకొని జీవనోపాధి పెంపొందించుకొని తమ గ్రామాల్లోని కుటుంబాలకు ఉపాధి అవకాశాలు పొందడానికి ఆ బాధ్యతలు అప్పగించడం జరుగుతుందని భద్రాచలం ఐటీడీఏ పీవో బి.రాహుల్ అన్నారు. సోమవారం ఐటీడీఏ సమావేశ మందిరంలో తెలంగాణ రాష్ట్ర ఖనిజాభివృద్ధి సంస్థ వారి ఆధ్వర్యంలో ఏజెన్సీ ప్రాంతంలోని ఇసుక ర్యాంపులు నిర్వహిస్తున్న మహిళ సొసైటీలతో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. భద్రాచలం పరిధిలోని ఇసుక ర్యాంపులు నిర్వహిస్తున్న గిరిజన మహిళలు కాంట్రాక్టర్లను, బినామీలను నమ్మి ఇసుక ర్యాంపుల నిర్వహణ వారికి అప్పగించకుండా మహిళలందరూ ఐకమత్యంగా ఉండి చూసుకోవాలని అన్నారు. పైలెట్ ప్రాజెక్టు కింద రెండు ఇసుక సొసైటీలను ఎంపిక చేసి సొసైటీకి రూ.50 లక్షల చొప్పున ఆర్థిక వెసులుబాటు కల్పించి అధికారుల సహాయంతో గోదావరిలో ఇసుక స్టాక్ పాయింట్ గుర్తించి టిప్పర్లు, ప్లానింగ్ మిషన్, డోజర్లు అద్దెకు ఇప్పించడం జరుగుతుందని, వాటి ద్వారా ఇసుక స్టాక్ పాయింట్‌కి తరలించిన దగ్గర నుంచి ఎన్ని క్యూబిక్‌ల ఇసుక టిప్పర్ల ద్వారా రవాణా అవుతున్నది ఇసుక స్టాక్ పాయింట్‌కి చేరవేసిన దగ్గర నుంచి వాటి నిర్వహణ బాధ్యత పూర్తిగా ఇసుక సొసైటీ మహిళలదేనని పేర్కొన్నారు. ఇసుక ర్యాంపులు సొంతంగా నిర్వహించుకునే గిరిజన మహిళలకు సాంకేతిక సహకారం, ఆర్థిక సహకారంతో పాటు మహిళలందరికీ తగిన శిక్షణ ఇవ్వడానికి ప్రత్యేక అధికారులను నియమించి వారి ద్వారా తగిన సలహాలు, సూచనలు అందించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పిపా ప్రత్యేక అధికారి మనిధర్, తెలంగాణ ఖనిజ అభివృద్ధి సంస్థ ప్రాజెక్టు మేనేజరు శంకర్‌నాయక్ పాల్గొన్నారు.

సింగరేణి అధికారుల పోరుబాట

- పీఆర్‌పీల కోసం ఏళ్ల తరబడి ఎదురుచూపులు
- లాభాల సింగరేణిలో అధికారులపై వివక్షత
- దశలవారీ ఆందోళనలకు అధికారుల సంఘం పిలుపు

ఇల్లెందు, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): సింగరేణి కాలరీస్ అభివృద్ధిలో, లక్ష్యాల సాధనలో కీలకపాత్ర పోషిస్తూ ఉత్పత్తి, ఉత్పాదకతలు సాధిస్తూ సంస్థను లాభాలబాటలో విస్తరింప చేస్తున్న సింగరేణి అధికారులు ఉద్యమాల బాట పడుతున్నారు. సింగరేణి లాభాల్లో ప్రతి ఏటా కార్మికులకు లాభాల వాటా చెల్లింపులు, ప్రభుత్వ పథకాలకు అనేక ప్రజాహిత పథకాలకు రూ.కోట్లు ఖర్చుచేస్తున్న యాజమాన్యం తమకు వేతనాల్లో భాగంగా చెల్లించవలసిన పర్‌ఫార్మెన్స్ రిలేటెడ్ పే(పీఆర్‌పీ)లను చెల్లించకుండా ఏళ్ల తరబడి జాప్యం చేస్తుందంటూ అధికారులు ఆగ్రహిస్తున్నారు. సింగరేణి వ్యాప్తంగా దశలవారీ ఆందోళనలకు పూనుకోవాలని గోదావరిఖనిలో ఆదివారం రాత్రి జరిగిన కోల్‌మైన్స్ ఆఫీసర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (సీఎంవోఏఐ) సింగరేణి కాలరీస్ విభాగం కేంద్ర కమిటీ సమావేశం నిర్ణయించింది. సింగరేణిలో విధులు నిర్వహిస్తున్న దాదాపు 2300మంది అధికారుల పట్ల ఎందుకు వివక్షత చూపుతున్నారంటూ సమావేశం తీవ్ర ఆవేదన వ్యక్తం చేసింది. ప్రభుత్వరంగ సంస్థలు నవరత్న కంపెనీలు, కోల్ ఇండియా అనుబంధ బొగ్గు ఉత్పాదక సంస్థల్లో వేతనాల్లో భాగంగా ప్రతి ఆర్థిక సంవత్సరంలో పీఆర్‌పీల చెల్లింపులు జరుగుతున్నాయి. కానీ సింగరేణి కాలరీస్‌లో పనిచేస్తున్న అధికారులకు మాత్రం ఏళ్లు గడుస్తున్నా.. పీఆర్‌పీల చెల్లింపులు జరగడంలేదని అధికారులు వాపోతున్నారు. కోల్ ఇండియా పరిధిలోని బొగ్గు గనుల అధికారులకు పీఆర్‌పీలను ఇప్పటికే పంపిణీ చేయడం గమనార్హం. 2022-23 ఆర్థిక సంవత్సరం పీఆర్‌పీని 2024 జూన్ 23న చెల్లించారు. కాగా 2023-2024 ఆర్థిక సంవత్సరం పీఆర్‌పీని సైతం ఈనెల 25న చెల్లించాలని కోల్ ఇండియా యాజమాన్యం ఆదేశాలు జారీ చేసింది. కాగా సింగరేణిలో మాత్రం చెల్లింపులు జరగకపోవడంతో అనేక పర్యాయాలు అధికారులు రాష్ట్ర ప్రభుత్వానికి, సింగరేణి యాజమాన్యానికి విజ్ఞప్తులు చేసినప్పటికీ వారి ఆవేదన అరణ్య రోదనగానే మారింది. తుదకు సింగరేణి అధికారులకు 2007-2008 నుంచి 2013-2014 వరకు చెల్లించాల్సిన పీఆర్‌పీలను వెంటనే చెల్లించాలని హైకోర్టు ఆదేశాలు ఇచ్చినప్పటికీ సింగరేణి యాజమాన్యం అమలు చేయలేదు. తీర్పు వచ్చి ఏడాది దాటినా పీఆర్‌పీ చెల్లింపులు లేకపోవడంతో కొందరు రిటైర్డ్ అధికారులు యాజమాన్యంపై కోర్టు ధిక్కారం కింద మరోపర్యాయం హైకోర్టును ఆశ్రయించినట్లు తెలిసింది. సింగరేణి వ్యాపితంగా 40వేల మంది బొగ్గు గని కార్మికులు ఉద్యోగులకు అమలు చేస్తున్న ఉచిత విద్యుత్తు సౌకర్యం కూడా అధికారుల నివాసాలకు వర్తింపచేయడం లేదని సింగరేణి అధికారులు వాపోతున్నారు. అనేక పర్యాయాలు సింగరేణి చైర్మన్‌కు, మంత్రులకు, పార్లమెంట్ సభ్యులకు వినతి పత్రాలు సమర్పించిన పట్టించుకోక పోవడంతో గత్యంతరం లేక ఆందోళనలకు పూనుకోవాలని అధికారుల సంఘం కీలక నిర్ణయం తీసుకోవడం గమనార్హం.



ఇల్లెందులో సింగరేణి జీఎంకు వినతి ప్రతం సమర్పించిన అధికారులు

దశలవారీ ఆందోళనలకు సంఘం పిలుపు

కోల్‌ఇండియా బొగ్గుగనుల్లో నవరత్న కంపెనీల్లో అధికారులకు వేతనాల్లో భాగంగా చెల్లించిన పీఆర్‌పీలను సింగరేణి కాలరీస్‌లో అధికారులకు వెంటనే చెల్లించాలని, కార్మికుల మాదిరిగా అధికారులకు ఉచిత విద్యుత్తు సౌకర్యం కల్పించాలని, పారదర్శకంగా పదోన్నతులు బదిలీలు జరపాలని డిమాండ్ చేస్తూ అధికారుల సంఘం దశల వారీ ఆందోళనలకు పిలుపునిచ్చింది. గోదావరిఖనిలో జరిగిన సింగరేణి విభాగం అధికారుల సంఘం విస్తృత సమావేశంలో పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. సింగరేణి వ్యాపితంగా అన్ని ఏరియాల కమిటీలు సెంట్రల్ కమిటీ నాయకుల సమావేశం సీఎంవోఏఐ సింగరేణి విభాగం అధ్యక్షుడు లక్ష్మిపతి గౌడ్ అధ్యక్షతన జరిగింది. ప్రధాన కార్యదర్శి పెద్ది నర్సింహులు, ఉపాధ్యక్షులు పోనుగోటి శ్రీనివాస్, రాజీవ్ వర్మ, శివప్రసాద్ తదితరులు పాల్గొన్న ఈ సమావేశంలో ఈ నెల 21వరకు అన్ని ఏరియాల్లో డిమాండ్లతో కూడిన వినతి పత్రాలను ఏరియా జనరల్ మేనేజర్ల ద్వారా సింగరేణి సీఎండీకి సమర్పించాలని నిర్ణయించారు. ఈ నెల 23న సీఎం రేవంత్‌రెడ్డికి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కకు వినతి పత్రాలను ఇవ్వాలని సానుకూలంగా స్పందన రాకపోతే జూన్ 24 నుంచి సింగరేణి వ్యాప్తంగా దశలవారీ ఆందోళనలు జరపాలని అధికారుల సంఘం పిలుపునిచ్చింది. అంతేగాక జూన్ 24న సింగరేణి వ్యాప్తంగా అధికారులు నల్ల బ్యాడ్జీలు ధరించాలని, జూలై 1 నుంచి నిరాహార దీక్షలు పాటించాలని, జూలై 7 నుంచి వర్క్ టు రూల్ ఉద్యమం చేపట్టాలని అధికారుల సంఘం నిర్ణయించింది. అప్పటివరకు కూడా తమకు న్యాయం జరగకపోతే పీఆర్‌పీలు చెల్లించకపోతే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేయాలని సింగరేణి అధికారుల సంఘం సమావేశంలో నిర్ణయం తీసుకున్నట్లు తెలిసింది.

ఇల్లెందులో జీఎంకు అధికారుల వినతి పత్రం

సింగరేణి అధికారుల సంఘం పిలుపు మేరకు సోమవారం సాయంత్రం ఇల్లెందులో సింగరేణి అధికారులు ఉద్యమంలో భాగంగా సింగరేణి ఇల్లెందు ఏరియా జనరల్ మేనేజర్ వి.కృష్ణయ్యకు వినతి పత్రం సమర్పించారు. సింగరేణి సాధిస్తున్న లాభాల నుండి కార్మికులకు వాటా చెల్లిస్తున్న యాజమాన్యం అధికారులకు చెల్లించకపోవడం శోచనీయమని వెంటనే పీఆర్‌పీలు చెల్లించాలని అధికారులు సింగరేణి జీఎంను కోరారు. తమ వినతి పత్రాన్ని సింగరేణి చైర్మెన్‌కు పంపాలని విజ్ఞప్తి చేశారు. సింగరేణి అధికారులు సంస్థ పురోభివృద్ధిలో అహోరాత్రులు శ్రమిస్తున్నారని సంస్థ లాభాల ఆర్జనలో కీలక పాత్ర వహిస్తున్నారని ఐనప్పటికీ అధికారుల పట్ల సింగరేణి యాజమాన్యం సానుకూలంగా స్పందించడం లేదని పేర్కొన్నారు. ఈ ఆందోళనలో ఇల్లెందు అధికారుల సంఘం అధ్యక్షుడు ఆనందపు శివప్రసాద్, ఎస్వోటూ జీఎం రామస్వామి, ఐఈడీ ఇంజినీర్ గిరిధర్, సర్వే ఆఫీసర్ రామ్మూర్తి, జేకే ఓసీ మేనేజర్ పూర్ణచందర్‌రావు, ఎన్విరాన్‌మెంటల్ ఆఫీసర్ ధనుంజయ్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు చిన్నయ్య, నాగేశ్వర్‌రావు, మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

జూలై 10న దమ్మక్క సేవాయాత్ర

రామాలయంలో ఆషాఢ మాసంలో జరిగే ఉత్సవాలివే..



భద్రాచలం, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): భద్రాచల శ్రీసీతారామచంద్రస్వామి వారి ఆలయంలో ఆషాడ మాసంలో ఈ ఉత్సవాలు జరుగుతాయి. 28న స్వామివారికి పుష్యమి నక్షత్రం సందర్భంగా పట్టాభిషేకం, జూలై 4న సుదర్శన హోమం, 5న ఆళ్వార్లకు స్నపన తిరుమంజనం, 10న దమ్మక్క సేవాయాత్ర నిర్వహించనున్నారు. అలాగే 21న సర్వేషాం ఏకాదశి సందర్భంగా లక్ష కుంకుమార్చన నిర్వహించనున్నారు. కాగా జూలై 10న దమ్మక్క సేవాయాత్ర 24 నుంచి 28 వరకు ఆండాళమ్మ వారి తిరునక్షత్రోవాలు నిర్వహించనున్నారు.

గురుకులంలో రెండో విడత స్పాట్ అడ్మిషన్ కౌన్సెలింగ్

భద్రాచలం, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని గిరిజన సంక్షేమ గురుకుల జూనియర్ కళాశాల 2025-26 విద్యా సంవత్సరానికి మొదటి సంవత్సరం, రెండో విడత బాలుర 352, బాలికలు 142 సీట్ల భర్తీకోసం స్పాట్ కౌన్సెలింగ్ సోమవారం నిర్వహించారు. విద్యార్థులు 494 సీట్లకు గాను 362 సీట్లు పారదర్శకంగా బాలుర,బాలికలకు కౌన్సెలింగ్ ద్వారా భర్తీ జరిగిందని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ దేవదాస్, సత్యనారాయణ, శ్యాంకుమార్, హరికృష్ణ, భద్రాచలం ప్రిన్సిపాల్ పద్మావతి, రమాదేవి, నాగేంద్రమ్మ, మాధవి, లత, చైతన్య, పుల్లమ్మ పాల్గొన్నారు.

ఇంటర్ అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో ఉమ్మడి జిల్లా విద్యార్థుల హవా

ఖమ్మం ఖానాపురంహవేలీ/కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్ సప్లిమెంటరీ పరీక్షా ఫలితాల్లో జిల్లాలో 72 శాతం ఉత్తీర్ణత లభించింది. మొత్తం జనరల్, ఒకేషనల్ విద్యార్థులు 14,343 మంది పరీక్షకు హాజరుకాగా, 10,323 మంది ఉత్తీర్ణత సాధించినట్లు జిల్లా ఇంటర్మీడియట్ అధికారి కె.రవిబాబు తెలిపారు. ప్రథమ సంవత్సరం జనరల్ విద్యార్థులు 9600ల మందికి 7248 మంది, ఒకేషనల్ విద్యార్థులు 676మంది విద్యార్థులకు 444 మంది ఉత్తీర్ణత సాధించారని, ద్వితీయ సంవత్సరంలో జనరల్ విద్యార్థులు 3,745 మందికి 2293, ఒకేషనల్‌లో 622 మందికి 337మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించినట్లు తెలిపారు.

రీకౌంటింగ్, రీవెరిఫికేషన్‌కు ఈ నెల 17 నుంచి 23 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. రీ వెరిఫికేషన్‌కు ఒక్కో సబ్జెక్టుకు రూ.600లు, రీకౌంటింగ్‌కు ఒక్కో సబ్జెక్టుకు రూ.100లు ఫీజు చెల్లించాలని తెలిపారు.

భద్రాద్రి జిల్లాలో

ఇంటర్ సప్లిమెంటరీ -2025 పరీక్షల ఫలితాలు సోమవారం విడుదల అయ్యాయి. ఈ ఫలితాలలో భద్రాద్రి జిల్లాలో జనరల్ రెండో ఏడాది 55.76 శాతం ఉత్తీర్ణులైనారు. వారిలో బాలుర 56.53 శాతం, బాలికలు 54.75శాతం సాధించారు. జనరల్ మొదటి ఏడాదిలో మొత్తం 70.22 ఉత్తీర్ణులైనారు. వారిలో బాలురు 64.82 శాతం, బాలికలు 74.92 శాతం సాధించారు. ఒకేషనల్ రెండో ఏడాది 60.61 ఉత్తీర్ణులైనారు. బాలురు 58.74 శాతం బాలికలు 64.57 శాతం సాధించారు. ఒకేషనల్ మొదటి ఏడాది 66.05 ఉత్తీర్ణులైనారు. వారిలో బాలురు 63.08 శాతం, బాలికలు 69.64 శాతం సాధించినట్లు ఇంటర్మీడియట్ నోడల్ అధికారి హెచ్.వెంకటేశ్వరరావు వివరాలు వెల్లడించారు.

కల్తీ విత్తనాలు అమ్మేవారిపై పీడీ యాక్టు పెట్టాలి

- నూతన విత్తన చట్టం రూపొందించాలి
- ఏఐయూకేఎస్ సమావేశంలో గుర్రం అచ్చయ్య



మాట్లాడుతున్న గుర్రం అచ్చయ్య

ఖమ్మం సంక్షేమ విభాగం, జూన్ 16(ఆంధ్రజ్యోతి): జిల్లాలో విచ్చలవిడిగా కల్తీ విత్తనాల విక్రయం జరుగుతుందని అక్రమవ్యాపారం చేసే వారిపై పీడీ యాక్టు నమోదు చేయాలని అఖిల భారత ఐక్య రైతు సంఘం రాష్ట్ర కోశాదికారి ఆవుల వెంకటేశ్వర్లు, జాతీయ నాయకులు గుర్రం అచ్చయ్య డిమాండ్ చేశారు. సరైన విత్తనాలను అధికారులు పరిశీలించకుండానే నర్సరీల్లో మొక్కలను పెంచి రైతులకు అమ్మకాలు జరుపుతున్నారని, ఎక్కడైనా రైతులకు అన్యాయం జరిగితే సంబంధిత వ్యవసాయశాఖ అధికారులపై చర్యలు తీసుకోవాలన్నారు. సోమవారం ఖమ్మం రామనర్సయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించిన సంఘం సమావేశంలో వారు మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం అమలులోకి తీసుకరాబోతున్న నూతన విత్తన చట్టం రైతుల వ్యవసాయ ప్రయోజనాలకు అనుగుణంగా ఉండాలన్నారు. సంఘం జిల్లా అధ్యక్షులు మలీదు నాగేశ్వరరావు, కార్యదర్శి కోలేటి నాగేశ్వరరావు, ఉపాధ్యక్షుడు నాగేశ్వరరావు, లాజర్, తేజా, సహాయ కార్యదర్శి పాల్గొన్నారు.

అంచనాలు మార్చాలిందే..

(5వ పేజీ తరువాయి)

ఫ్లడ్ మాన్యువల్‌లో మార్పులు(అప్‌డేట్) ఎంతో అవసరమనే వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి. 2022 జూలైలో వచ్చిన గోదావరి వరదలు గత 32ఏళ్లలో భద్రాచలం ఏజెన్సీవాసులు ఎన్నడూ చూడలేదు. 1990లో 70.8 అడుగుల నీటిమట్టం భద్రాచలం వద్ద నమోదు కాగా 2022 జూలై 16న భద్రాచలం వద్ద గరిష్ఠంగా 71.3 అడుగుల నీటిమట్టం నమోదైంది. ఫలితంగా వంద గ్రామాలు వ్యవసాయపరంగా ప్రభావితం కాగా 79 గ్రామాలు ముంపు బారిన పడ్డాయి. దీంతో 15,465 మంది కుటుంబాలకు చెందిన 21 వేల మందికి 77పునరావాస కేంద్రాల్లో ఆశ్రయం కల్పించారు.

5,047మంది రైతులపై వరద ప్రభావం చూపగా వారికి చెందిన 10.831ఎకరాల పంట నీట మునిగింది. ఈ వరదలతో భద్రాచలం, బూర్గంపాడు, చర్ల, మణుగూరు, పినపాక, అశ్వాపురం మండలాలు అతలాకుతలమయ్యాయి. దీనికి ప్రధాన కారణం పోలవరం బ్యాక్ వాటర్ ప్రభావమేనని సాగునీటిరంగ నిపుణులు ప్రజాప్రతినిధులు, అధికారులు చెబుతున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో తాజాగా 2022 వరదలను ప్రాతిపదికన చేసుకొని పోలవరం బ్యాక్‌వాటర్ ఎంత మేరకు ప్రభావం చూపుతుందనే దానిపై శాస్త్రీయ గణాంకాలను పరిగణలోకి తీసుకొని గోదావరి వరద మాన్యువల్‌ను నవీకరణ చేయాల్సిన అవసరం ఉందన్న అభిప్రాయాలు సర్వత్రా వినిపిస్తున్నాయి.

'కిన్నెరసాని'కి ప్రత్యేక నిధులు

(5వ పేజీ తరువాయి)

అవసరమైన నిధులను జెన్కో సంస్థకు రూ. 1.90కోట్లు కేటాయించింది. ఈ క్రమంలో పరిశీలన బృందం అధికారులు ప్రాజెక్టు విస్తీర్ణంలోని పూడిక తీత, స్లూయిస్‌కు దిగుభాగాన పటిష్ఠత, ముంపు ప్రభావాన్ని తగ్గించే పనులను పరిశీలించనున్నట్లు తెలిసింది. చేపట్టే పనులపై సమగ్ర ప్రణాళికలు సిద్ధం చేసి జెన్కో అధికారులతో చర్చించనున్నట్లు తెలుస్తోంది.

కిన్నెరసాని ప్రాజెక్టు తాత్కాలిక మరమ్మతల కోసం రూ.1.20కోట్లు జెన్కో మంజూరు చేసింది. ఈ మేరకు టెండర్ల పక్రియ విద్యుత్ సౌధలో మొదలైందని ప్రాజెక్టు ఈఈ వెంకటేశ్వర్లు తెలిపారు. 13 గేట్లకు సంబంధించిన మరమ్మతులు, డ్యాంపైన సైడ్ వాల్స్ కట్ట నీటి కోతకు గురవకుండా పటిష్ఠ పనులను చేయించనున్నారు. స్లూయిస్ లీకేజీ పనులు మాత్రం 383అడుగుల మేరకు నీటి మట్టం తగ్గినప్పుడే సాధ్యపడే అవకాశం ఉంది. నీటి మట్టం అంచనా వేసుకుని ఈ నిధులతో లీకేజీ పనులు చేపట్టనున్నారు. ఈ పనులపై ఇప్పటికి రెండుసార్లు టెండర్లు జరిగాయి. కాంట్రాక్టర్లు ముందుకు రాకపోవడంతో మూడోసారి టెండర్లు నిర్వహిస్తున్నట్లు ప్రాజెక్టు అధికారులు తెలిపారు.

ఆటో, బైక్ ఢీ.. వృద్ధుడి మృతి

ముదిగొండ, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో ఓ వృద్ధుడు మృతిచెందిన సంఘటన ముదిగొండ మండలం వనంవారిక్రిష్ణాపురం వద్ద సోమవారం రాత్రి చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన ప్రకారం.. ఏపీలోని ఎన్టీఆర్ జిల్లా జగ్గయ్యపేట మండలం భూదాడ గ్రామానికి చెందిన పరిటాల పున్నయ్య(70) ఖమ్మం నుంచి జగ్గయ్యపేటకు ఆటోలో వెళ్తుండగా ఎదురుగా వస్తున్న ద్విచక్రవాహనం ఢీకొంది. ఈ ప్రమాదంలో పున్నయ్యకు తీవ్రగాయాలు కాగా ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ పున్నయ్య మృతిచెందాడు. ఈ ప్రమాదంలో ద్విచక్రవాహనదారుడు ఉపేందర్‌కు తీవ్రగాయాలయ్యాయి.

ఇది ప్రభుత్వ కార్యాలయమేనా ?




ఇది రికార్డుల గది దుస్థితి

- పాడుబడిన భవనంలో ఎంపీడీవో ఆఫీస్
- కనీస మరమ్మతులకు నిధుల్లేవట..
- పోస్టుల మంజూరు, నియామకాలు మరిచారు
- దాతల సహకారంతో కుర్చీల ఏర్పాటు

భద్రాచలం, జూన్ 16(ఆంధ్రజ్యోతి): ఇది ఒక ప్రభుత్వ కార్యాలయమేనా.. ప్రజలు లోపలికి వెళ్తే బూత్ బంగ్లాను తలపించేలా ఉంటుంది.. గతంలో జరిగిన అగ్ని ప్రమాదంతో కాలిపోయిన గదులకు నల్లటి మరకలు.. సగం కాలిన ఆఫీసు సామగ్రి, పగిలిన టైల్స్‌తో పాటు వర్షాకాలం వస్తే కురిసే పరిస్థితి. కనీసం కుర్చీలకు సైతం డబ్బులేక దాతల సహకారంతో ఏర్పాటు చేసుకున్న వైనం. ఇలా అనేక సమస్యలతో భద్రాచలం మండలప్రజాపరిషత్ కార్యాలయం పని చేస్తోంది. గతంలో 22 పంచాయతీలతో ఉన్న ఎంపీడీవో కార్యాలయం తెలంగాణ విభజనతో మండల కార్యాలయం గతంలో ఎత్తివేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తరువాత మళ్లీ భద్రాచలం మండలపరిషత్‌ను పునరుద్ధరించారు. అయితే నిర్వహణకు కనీస నిధులు లేకపోవడంతో ఎన్నో సమస్యలు ఈ ప్రభుత్వ కార్యాలయంలో ఉన్నాయి. కార్యాలయానికివచ్చే వారు ఈ బూత్‌బంగ్లాను చూసి ఆశ్చర్యపోయే పరిస్థితి ఉందంటే అతిశయోక్తి కాదు.

పాడుబడిన భవనంలో...

భద్రాచలం ఎంపీడీవో కార్యాలయంలో గతంలో జరిగిన అగ్ని ప్రమాదంలో అందులోని పలు గదుల్లో ఉన్న ఫర్నీచర్, రికార్డులు, బీరువాలు కాలిపోయాయి. గతంలో ఎంపీడీవో కార్యాలయంగా కొనసాగిన ఈ భవనంలోనే మళ్లీ కార్యాలయంను ఏర్పాటు చేశారు. 2024 నవంబరు 26న రాష్ట్ర ప్రభుత్వం జీవో నెం.67 ద్వారా భద్రాచలం మండలపరిషత్ కార్యాలయంను పునరుద్ధరించింది. భవనం మొత్తంలో కేవలం మూడు గదులు మాత్రమే వినియోగంలో ఉన్నాయంటే పరిస్థితి ఎంత దయనీయంగా ఉన్నాయంటే అవగతమవుతుంది. అసలు కార్యాలయంలోకి ప్రవేశిస్తే ఎక్కడ చూసినా కాలిన నల్లటి మసితో ఉన్న గోడలు, సగం కాలి మిగిలిన తలుపులు, పనికిరాని బీరువాలు, కాలిపోయిన రికార్డులను ఎక్కడ పడితే అక్కడ పడేసిన సగం కాలిన కుర్చీలతో ప్రజలకు దర్శనమిస్తాయి.



కాలిన మసితో ఉన్న కార్యాలయంలోని గది



భద్రాచలం ఎంపీడీవో కార్యాలయం

పోస్టుల మంజూరీ ,నియామకాలు మరిచారు

భద్రాచలం మండలంగా తిరిగి ఆవిర్భవించి ఆరు నెలలు దాటినా నేటికి ఎంపీడీవో కార్యాలయంలో పోస్టుల భర్తీకి చొరవ తీసుకోకపోవడం పట్ల సర్వత్రా ఆక్షేపణలు వినిపిస్తున్నాయి. 80,760 జనాభాతో, 14 ఎంపీటీసీలు ఈ మండల పరిధిలో ఉన్నాయి. కాగా ఇక్కడ బాధ్యతలు నిర్వహించేందుకు అవసరమైన పోస్టులపై ప్రభుత్వం ఇంకా ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. ఎంపీడీవో, సూపరింటెండెంట్, యుడీసీ, ఎల్‌డీసీ, ఆఫీసు సబార్డినేట్ పోస్టులు మంజూరు చేయాల్సి ఉండగా ఆ ఊసే మరవడం పట్ల భద్రాద్రివాసులు ఆక్షేపణలు వ్యక్తం చేస్తున్నారు. ఇదిలా ఉండగా ఎంపీడీవో కార్యాలయ నిర్వహణ కోసం పాల్వంచకు చెందిన ఎంపీఈవోను డిప్యూటేషన్ ప్రాతిపదికన ఇన్‌చార్జి ఎంపీడీవోగా నియమించారు. అలాగే ఇతర సిబ్బందిని డిప్యూటేషన్లపైనే నియమించారు. ఇక్కడ ఉద్యోగులు ఫైల్స్‌ను భద్రపర్చుకునేందుకు బీరువాలు కూడా లేకపోవడంతో కాలిపోయిన బీరువాల్లోనే భద్రపర్చుకుంటున్నట్లు సమాచారం. కనీసం కంప్యూటర్లు కూడా లేకపోవడంతో ఇతర ప్రభుత్వ కార్యాలయాల నుంచి తీసుకొచ్చుకొని పనులు నిర్వహిస్తున్నారు. 2025-26 నూతన ఆర్థిక సంవత్సరం ఏప్రిల్ ఒకటి నుంచి ప్రారంభమైన క్రమంలో ఇందుకు సంబంధించి కార్యాచరణ ప్రణాళికను రూపొందించలేదని సమాచారం. మండలస్థాయిలో ఎంతో కీలకమైన కార్యాలయాల్లో ఎంపీడీవో కార్యాలయం కూడా ఒకటి. అంతటి కీలక కార్యాలయం నిర్వహణకు నిధులు విడుదలకు ప్రభుత్వం ఉన్నతాధికారులు చొరవ చూపకపోవడం ఎంత మాత్రం సమంజసం కాదనే వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి.

నవోదయలో ప్రవేశాలకు ప్రకటన

కొత్తగూడెం అర్బన్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): జవహర్ నవోదయ విద్యాలయాల్లో(జేఎన్‌వీ) ప్రవేశాలకు ప్రకటన విడుదలైంది. 2026-2027 విద్యా సంవత్సరంలో ఆరో తరగతిలో చేరేందుకు జూలై 29వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరిస్తారు. ఈమేరకు జిల్లాలోని అశ్వాపురం మండలం బీజీ కొత్తూరులో 30ఎకరాల స్థలాన్ని నవోదయ స్కూల్ కోసం కేటాయించారు. ఈ విద్యా సంవత్సరంలో కలెక్టర్ సూచనలమేరకు డీఈవో కరకగూడెంలోని జడ్పీహెచ్ఎస్‌లో ఒక బ్లాక్‌ను కేటాయించారు. ఇక్కడ ప్రవేశం లభిస్తే ఆరు నుంచి 12వ తరగతి వరకు ఉచితంగా విద్య అందుతుంది. బాలురు, బాలికలకు వేర్వేరుగా వసతి కల్పిస్తారు. విద్యాలయంలో ప్రవేశానికి 75శాతం గ్రామీణ, 25శాతం పట్టణ ప్రాంత విద్యార్థులకు ప్రభుత్వ నియమ నిబంధనల మేరకు రిజర్వేషన్లు అమలు అవుతాయి. ప్రవేశ పరీక్షలోమార్కుల ఆధారంగా 80మంది విద్యార్థులకు ఆరో తరగతిలో అవకాశం కల్పిస్తారు. ప్రభుత్వ, గుర్తింపు పొందిన పాఠశాలల్లో 3,4 తరగతులు చదివి 2025-26 విద్యాసంవత్సరంలో 5వ తరగతి చదువుతూ ఉన్న అభ్యర్థులు ప్రవేశానికి అర్హులు. 2014 ఏప్రిల్ 1నుంచి 2016 జూలై 31లోపు జన్మించిన వారు దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం ఉంది. తెలుగు రాష్ట్రాల్లో డిసెంబర్ 13న(శనివారం) ఉదయం 11.30 గంటలకు ప్రవేశ పరీక్ష నిర్వహిస్తారు.

ఇందిరమ్మ ప్రభుత్వంలో
అభివృద్ధి పరుగులు

(5వ పేజీ తరువాయి)

ఆయన పలు అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. గువ్వలగూడెంలో రూ.30లక్షల వ్యయంతో నిర్మించనున్న అంతర్గత సీసీ రోడ్లకు, కోరట్లగూడెంలో పాత కోరట్లగూడెం నుంచి రాజేశ్వరపురం షుగర్ ఫ్యాక్టరీ వరకు రూ.2.50కోట్లు, మూటాపురంలో మూటాపురం నుంచి-కూసుమంచి మండలం జీళ్లచెర్వు వరకు రూ.4.40కోట్ల వ్యయంతో నిర్మించనున్న బీటీ రోడ్లకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో జరిగిన సభల్లో మంత్రి మాట్లాడుతూ రాష్ట్రాన్ని రేవంత్‌రెడ్డి అభివృద్ధిలో పరుగులు పెట్టిస్తున్నారని, రాష్ట్రం అప్పుల్లో ఉన్నా సంక్షేమ పథకాలు, అభివృద్ధిని ఆపకుండా కొనసాగిస్తున్నారన్నారు. గత పదేళ్ల రాష్ట్రాన్ని పాలించిన బీఆర్ఎస్ నేతలు రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చారని, ధనిక తెలంగాణను అప్పుల తెలంగాణగా మార్చారని, అయినా తాము ఆ అప్పులు, వడ్డీలు కట్టుకుంటూ అభివృద్ధి, సంక్షేమం ఆగకుండా పాలన సాగిస్తున్నామన్నారు. రాష్ట్రంలో ప్రతీ నియోజకవర్గానికి 3,500ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేశామని, అర్హులైన ప్రతీ పేదకు ఇందిరమ్మ ఇంటిని ఇస్తామని భరోసానిచ్చారు. గత పదేళ్ల రాష్ట్రాన్ని పాలించిన వారు రూ.17వేల కోట్లు రుణమాఫీని చేస్తే.. ఇందిరమ్మ ప్రభుత్వం వచ్చిన 18నెలల్లోనే రూ.21వేల కోట్లు రుణమాఫీ చేసినట్టు మంత్రి పేర్కొన్నారు. పేదల కష్టాలు తెలిసిన నాయకుడిగా, పేదల ఆకాంక్షలు తీర్చే దిశగా సీఎం రేవంత్‌రెడ్డి కృషి చేస్తున్నారన్నారు. రానున్న అన్ని ఎన్నికల్లో ఇందిరమ్మ ప్రభుత్వాన్ని ఆశీర్వదించాలని పొంగులేటి కోరారు. కార్యక్రమాల్లో కలెక్టర్ అనుదీప్, గిడ్డంగుల సంస్థ చైర్మన్‌రాయల నాగేశ్వరరావు, వెన్నపూసల సీతారాములు, శాఖమూరి రమేష్, బొడ్డు బొందయ్య, బచ్చలకూరి నాగరాజు, మామిడి వెంకన్న, కుక్కల హనుమంతరావు, తదితరులు పాల్గొన్నారు.

సంచారుల నిలయంగా
సంక్షేమ హాస్టల్

తల్లాడ, జూన్16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మల్లవరం గ్రామంలోని ప్రభుత్వ బీసీ సంక్షేమశాఖ బాలుర హాస్టల్ భవనం సంచారులకు నిలయమైంది. హాస్టల్ పునఃప్రారంభంపై బీసీ సంక్షేమశాఖ అధికారులు దృష్టి సారించకపోవడంతో రెండేళ్ల నుంచి హాస్టల్ భవనం నిరుపయోగంగా మారింది. హాస్టల్‌లో స్థానిక విద్యార్థులు మాత్రమే ఉన్నారనే కారణంతో బీసీ సంక్షేమశాఖ అధికారులు 2023న ఆగస్టు నెలలో హాస్టల్‌ను అర్థాంతరంగా మూసివేశారు. అప్పట్లో హాస్టల్‌లో పనిచేసిన వార్డెన్, కుక్‌వర్కర్, వాచ్‌మెన్లను ఇతర హాస్టల్‌లో సర్దుబాటు చేశా రు. జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో ఉన్న బీసీ విద్యార్థులను సమీకరించి హాస్టల్‌ను పునఃప్రారంభించాలని బీసీ సంక్షేమశాఖ అధికారులు నిర్ణయించారు. అయినప్పటికి అటువంటి ప్రయ త్నం జరగకపోవడంతో హాస్టల్ పునఃప్రారంభానికి నోచుకోలేదు. దీంతో లక్షలాది రూపాయలు విలువైన విశాలమైన ఆరుగదులు, బోరుమోటారు తోనీటి వసతి, మరుగుదొడ్ల సౌకర్యం ఉన్న హాస్టల్‌భవనం నిరుపయోగంగా ఉంది. తరుచు వలస వచ్చే సంచారులు తాత్కాలిక నివాసంగా హాస్టల్‌భవనాన్ని వినియోగించుకుంటున్నారు. సరైన నిర్వాహణ లేకపోవడం వల్ల హాస్టల్ భవనం శిథిలమయ్యే పరిస్థితి ఉంది.



హాస్టల్ భవనం వద్ద నివాసం ఉంటున్న సంచార కుటుంబాలు



జిజ్ఞాస భూమిక.. విజ్ఞాన వీచిక

inspire

- నూతన ఆవిష్కరణలకు ఆహ్వానం
- 2024వ సంవత్సరంలో ఇన్‌స్పైర్ అవార్డుకు 108 ప్రాజెక్టుల ఎంపిక
- ఈ ఏడాది నుంచి ఇంటర్ విద్యార్థులకు అవకాశం
- భద్రాద్రి కొత్తగూడెం డీఈవో వెంకటేశ్వరచారి

కొత్తగూడెం, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): 2025-26 విద్యా సంవత్సరానికి గాను ఇన్‌స్పైర్ మనాక్ రిజిస్ట్రేషన్ పక్రియ ప్రారంభమైందని, ఈ ఏడాది ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు కూడా ఇన్‌స్పైర్- మనాక్‌కు రిజిస్ట్రేషన్ చేయాలని జిల్లా విద్యాశాఖాధికారి ఎం. వెంకటేశ్వర చారి, జిల్లా సైన్స్ ఆఫీసర్ ఎస్. చలపతిరాజు కోరారు. సోమవారం 2025-26 విద్యాసంవత్సరం ఇన్‌స్పైర్ మనాక్ రిజిస్ట్రేషన్ గురించి వారు తెలిపారు. ఈ ఏడాది విద్యా సంవత్సరం ఆరంభం నుంచే ఇన్‌స్పైర్ కార్యక్రమాలు ప్రారంభమయ్యాయని, ఈ నెల 15వ తేదీ నుంచి సెప్టెంబర్ 15వ తేదీ వరకు రిజిస్ట్రేషన్లు జరుగుతాయని పేర్కొన్నారు. గతంలో మాదిరిగా రిజిస్ట్రేషన్ల చివరి తేదీలు పొడిగింపు ఉండదని తెలిపారు. ఈ ఏడాది ఇంటర్మీడియట్ చదివే విద్యార్థులు సైతం ఇన్‌స్పైర్ మనాక్‌కు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

నిబంధనల సడలింపు..

గతంలో ప్రతి పాఠశాల నుంచి తప్పని సరిగా హైస్కూల్ నుంచి ఐదు, ప్రాథమికోన్నత పాఠశాల నుంచి రెండు ప్రాజెక్టులు రిజిస్ట్రేషన్లు చేయాలనే నిబంధన ఉండేది, కొత్త నిబంధనల ప్రకారం 6 - 10వ తరగతులు చదివే విద్యార్థులు 1వ తరగతి నుంచే ఐదు ప్రాజెక్టులు అప్‌లోడ్ చేసుకునే అవకాశం కల్పించారు. ప్రాథమికోన్నత పాఠశాల నుంచి కూడ ఐదు ప్రాజెక్టులు అప్‌లోడ్ చేసుకోవచ్చు. కొత్తగా ఇంటర్మీడియట్ విద్యార్థులు కూడా ఇన్‌స్పైర్ రిజిస్ట్రేషన్స్‌లో పాల్గొనాల్సి ఉంటుంది. నూతన ఆవిష్కరణలకు మాత్రమే రిజిస్ట్రేషన్స్‌కు అవకాశం ఉంటుంది. ఈ సారి ముందుగానే యాప్‌ను విడుదల చేశారు. పోస్టల్ బ్యాంక్ ఖాతాను కూడ పరిగణలోకి తీసుకుంటారు.



ఇన్‌స్పైర్ యాప్

108 ప్రాజెక్టులకు రూ.10.80లక్షల విడుదల

2024లో ఇన్‌స్పైర్ మనాక్ - నతన ఆవిష్కరణ ఎంపిక కోసం 580మంది విద్యార్థులు రిజిస్ట్రేషన్ చేసుకోగా వీరిలో 108 ప్రాజెక్టులు ఎంపికయ్యాయని వారు తెలిపారు. ఒక్కొక్క ప్రాజెక్టుకు రూ.10వేలు నేరుగా విద్యార్థులు బ్యాంక్‌ఖాతాల్లో జమ చేశారు. 108మందికి మొత్తం రూ. 10.90లక్షలు విడుదల చేశారు. గతంలో ఎన్నడు 100 ప్రాజెక్టులు ఎంపిక లేదని ఈ ఏడాది 108 ప్రాజెక్టులు ఎంపికైనందుకుగాను గైడ్ టీచర్స్ విద్యార్థులను అభినందించారు. సమాజానికి, దేశానికి ఉపయోగపడే నూతన ఆవిష్కరణలు మాత్రమే అప్‌లోడ్ చేయాలని సూచించారు. గత ఏడాది జాతీయ ఇన్‌స్పైర్ పోటీలకు ఒక ప్రాజెక్టు ఎంపికైనట్లు డీఈవో తెలిపారు.



రోడ్డు ప్రమాదంలో లారీ డ్రైవర్ మృతి

బూర్గంపాడు, జూన్ 16(ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారిపై నిలిపి ఉంచిన లారీని.. వెనుక నుంచి వస్తున్న మరో లారీ ఢీకొట్టిన ఘటనలో డ్రైవర్ మృతి చెందాడు. ఈ విషాద ఘటన సోమవారం రాత్రి సమయంలో సండెల్లరామాపురం వద్ద చోటుచేసుకుంది. భద్రాచలం నుంచి లక్ష్మీపురం వైపునకు వెళ్తున్న లారీని డ్రైవర్ సందీప్(28) అనే వ్యక్తి బూర్గంపాడు మండల పరిధిలోని సండెల్ల రామపురం వద్ద రోడ్డుపై నిలిపి ఉంచి దాని ముందుగా నిలబడి ఉన్నాడు. ఈ క్రమంలో వెనుక వైపు నుంచి వేగంగా వస్తున్న మరో లారీ.. జాతీయరహదారిపై నిలిపి ఉంచిన లారీని బలంగా ఢీకొట్టింది. దీంతో లారీ ముందు ఉన్న డ్రైవర్ సందీప్ పైకి నిలిపి ఉంచిన లారీ దూసుకవెళ్లడంతో తీవ్ర గాయాలపాలై అక్కడికక్కడే మృతి చెందాడు. వెనుక నుంచి ఢీకొట్టిన లారీ డ్రైవర్ క్యాబిన్‌లో ఇరుక్కుపోవడంతో స్థానికులు బయటకు తీసి భద్రాచలంలోని ఆస్పత్రికి తరలించారు. మృతుడు అశ్వాపురం మండల పరిదిలోని అమెర్ధ గ్రామానికి చెందిన తెలిపారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని ప్రమాదంపై ఆరా తీశారు. జాతీయరహదారిపై ప్రమాదం జరగడంతో ట్రాఫిక్ నిలిచి పోయి రాకపోకలకు అంతరాయం ఏర్పడింది.

ద్విచక్ర వాహనాన్ని కారు ఢీకొని..

ఖమ్మం రూరల్, జూన్ 16(ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనాన్ని కారు ఢీకొట్టిన ఘటనలో ఓ వ్యక్తి మృతిచెందిన సంఘటనపై ఖమ్మం రూరల్ పోలీస్ స్టేషన్‌లో సోమవారం కేసునమోదు అయింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కురవి మండలం, పోలంపల్లి తండా గ్రామానికి చెందిన భదావత్ రాజేష్ (30)వ్యవసాయం చేస్తుంటాడు. ఈనెల 15న ఆదివారం ద్విచక్రవాహనంపై ఖమ్మం వచ్చి పని ముగించుకుని తిరిగి ఇంటికి వెలుతుండగా రూరల్ మండలం, రెడ్డిపల్లి మారెమ్మతల్లి ఆలయం సమీపంలో ఎదురుగా వచ్చిన కారు ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్ర గాయాలపాలైన రాజేష్‌ను స్థానికులు 108 ద్వారా ఖమ్మం ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతు సోమవారం రాజేష్ మృతి చెందాడు. మృతుని కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఇరువర్గాలపై కేసుల నమోదు

కామేపల్లి, జూన్ 16(ఆంధ్రజ్యోతి): కామేపల్లి మండలం పింజరమడుగు గ్రామంలో ఇరువర్గాలు తిట్టుకొని, కొట్టుకోవడంతో ఇరువర్గాలపై కేసులు నమోదు చేశామని ఎస్ బి. సాయికుమార్ తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పింజరమడుగు గ్రామానికి చెందిన కొందరు ఒకరిపై తిట్టుకొని దాడి చేసుకొన్న ఘటనలో ఓ వర్గంపై దాడి కేసు, మరో వర్గంపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు ఎస్ఐ బి. సాయికుమార్ తెలిపారు.

మద్యానికి డబ్బులివ్వలేదని వ్యక్తి బలవన్మరణం

ఇల్లెందురూరల్, జూన్16 (ఆంధ్రజ్యోతి): మద్యం తాగడానికి భార్య రూ.100 ఇవ్వలేదని, క్షణికావేశంలో పురుగుల మందు తాగి భర్త మృతి చెందిన సంఘటన ఇల్లెందు మండలం వేములవాడ గ్రామంలో సోమవారం జరిగింది. గ్రామస్థులు, పోలీసుల కథనం మేరకు.. వేములవాడ గ్రామానికి చెందిన కల్తీ రామయ్య(45) మద్యం కొనుగోలు చేయడానికి భార్య డబ్బులు ఇవ్వలేదని ఇంట్లో ఉన్న పురుగుల మందు తాగాడు. రామయ్య తల్లి మంగమ్మ అనారోగ్యంతో ఇటీవల మృతి చెందింది. ఆమె కర్మకాండలు ఇంట్లో నిర్వహిస్తుండగా తాను మద్యం తాగడానికి రూ.100 కావాలని భార్య కుమారిని అడగగా ఆమె తిరస్కరించింది. దీంతో కోపోద్రిక్తుడైన రామయ్య ఇంట్లో చేను పనుల కోసం ఉంచిన పురుగుల మందును తాగాడు. స్థానికులు,కుటుంబ సభ్యులు హుటాహుటిన రామయ్యను మహబూబాబాద్ ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడికి భార్య, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు.

గంజాయి కేసులో ముగ్గురి అరెస్ట్



నిందితుల వివరాలు వెల్లడిస్తున్న పోలీసులు

అశ్వారావుపేట రూరల్, జూన్ 16(ఆంధ్రజ్యోతి): గంజాయి కేసులో పరారీలో ఉన్న ముగ్గురు యువకులను పోలీసులు అరెస్ట్ చేశారు. పోలీస్‌స్టేషన్‌లో సోమవారం సీఐ నాగరాజురెడ్డి ఎస్ఐ యయాతిరాజుతో కలిసి అరెస్ట్ వివరాలు వెల్లడించారు. గతనెల 8న అశ్వారావుపేటలోని భద్రాచలం రోడ్‌లో వాహనాల తనిఖీలు నిర్వహిస్తుండగా అనుమానస్పదంగా కనిపించిన ఏడుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ.2.75లక్షల విలువైన ఐదున్నర కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఏడుగురు వ్యక్తులను అరెస్ట్ చేశామన్నారు. విచారణలో ఇదే కేసుతో సంబంధం ఉన్న 8మందిని వారం క్రితం అరెస్ట్ చేశామన్నారు. తాజాగా ఇదే కేసుకు సంబంధించి పరారీలో ఉన్న అశ్వారావుపేటకు చెందిన ములగచర్ల వంశీ, పాండ్ల గౌరీ ప్రసాద్, కోడెల్లి మదన్‌ను అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరిచినట్లు వివరించారు.

ఇద్దరు విలేకరులపై కేసు నమోదు

దమ్మపేట, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): అక్రమంగా ఇసుక తరలిస్తున్నారని, డబ్బులు ఇవ్వాలని డిమాండ్ చేసిన ఇద్దరు విలేకరులపై దమ్మపేట పోలీసులు సోమవారం కేసు నమోదు చేశారు. మందలపల్లి గ్రామానికి చెందిన తలపుల దివ్య మహిళకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు అయింది. ఆఇంటి నిర్మాణానికి ఆదివారం రాత్రి కాంట్రాక్టర్ సంగసాని రమేష్ ఇసుక తీసుకు వస్తుండగా వివిధ సంస్థల్లో పని చేస్తున్న ఇద్దరు విలేకరులు నీలం సాయికుమార్, వినోద్ అడ్డుకున్నారు. అక్రమంగా ఇసుకను తరలిస్తున్నారంటూ, డబ్బులు ఇవ్వాలంటూ డిమాండ్ చేయటంతోపాటు బెదిరింపులకు పాల్పడ్డారు. దీంతో కాంట్రాక్టర్ రమేష్ సోమవారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఎస్ఐ సాయికిషోర్‌రెడ్డి కేసు నమోదు చేశారు.

అయ్యా రామకృష్ణ గారూ.. అన్నీ ఖమ్మానికే ఇచ్చా..!

- జాగ్రత్తగా చూసుకోండి
- ఆదర్శ రైతుతో ముఖ్యమంత్రి ఆసక్తికర సంభాషణ
- రాష్ట్రంలో ఖమ్మం రైతులు ఆదర్శం: కలెక్టర్ అనుదీప్

నేలకొండపల్లి, జూన్16 (ఆంధ్రజ్యోతి): నేలకొండపల్లి రైతువేదికలో సోమవారం జరిగిన రైతునేస్తం వీడియో కాన్ఫరెన్సులో చెన్నారానికి చెందిన ఆదర్శ రైతు మంకెన రామకృష్ణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో మాట్లాడారు. ఈసమయంలో ఆసక్తికర సంభాషణ చోటు చేసుకుంది. తొలుత కార్యక్రమ నిర్వాహకులు ఆదర్శ రైతు రామకృష్ణను ముఖ్యమంత్రితో మాట్లాడాలని కోరారు. దీంతో ఆయన తాను ఇప్పటి వరకు జరిగిన రైతునేస్తం 57 ఎపిసోడ్లను మిస్ కాలేదని, 58వ ఎపిసోడ్‌కు హాజరయ్యానని అన్నారు. రైతునేస్తం ద్వారా వ్యవసాయ శాస్త్రవేత్తల మంచి సాగు విషయాలు తెలుసుకుంటున్నామని అన్నారు. వ్యవసాయ శాఖ, అనుబంధ రంగాల శాస్త్రవేత్తల ద్వారా అనేక విషయాలు తెలుసుకుంటున్నామని, శాస్త్రవేత్తల ద్వారా అందించే విజ్ఞానం రైతులకు ఎంతో ఉపయోగపడుతున్నదని అన్నారు. వ్యవసాయ విస్తరణ కార్యక్రమం తెలంగాణాలో చాలా బాగుందని, తమిళనాడుకు చెందిన బృందాలు సైతం రాష్ట్రానికి వచ్చి స్టడీ చేసి వెళుతున్నాయన్నారు. అందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్క, రెవెన్యూ మంత్రి శ్రీనివాసరెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పందిస్తూ ' అయ్యా.. రామకృష్ణగారూ.. వ్యవసాయం, ఆర్థికం, రెవెన్యూ అన్నీ ఖమ్మానికే ఇచ్చాం... అంతా మీదగ్గరే ఉంది.. జాగ్రత్తగా చూసుకోండి' అని అనడంతో రైతులు ఒక్కసారిగా హర్షధ్వానాలతో చప్పట్లు కొట్టారు.

రాష్ట్రంలో ఖమ్మం జిల్లా రైతులుఆదర్శంగా నిలుస్తున్నాయని కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు. వీడియో కాన్ఫరెన్సు అనంతరం రైతు నేస్తానికి హాజరైన రైతులను ఉద్దేశించి కలెక్టర్ అనుదీప్ మాట్లాడారు. ముఖ్యమంత్రి సూచనల మేరకు ప్రభుత్వం అందించే రైతు భరోసాతో రైతులు వరి పంటనే గాకుండా అన్నిరకాల పంటలను సాగు చేయాలని కోరారు. ఆదర్శ రైతులచే వారి అనుభవాలను పంచుకునే విధంగా రైతు వేదికల్లో కార్యక్రమాలను ఏర్పాటు చేస్తామని కలెక్టర్ చెప్పారు. కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ శ్రీజ, డీఏవో పుల్లయ్య, ఏడీఏ సరిత, ఎంఏవో రాధ, తహసీల్దార్ ఓరుగంటి వెంకటేశ్వర్లు, ఎమ్మారైలు మధుసూధనరావు, రవి, రైతులు పాల్గొన్నారు.

పామాయిల్ సాగు పెంచండి

- మణుగూరు రైతు వేదికలో సీఎం సందేశం

మణుగూరుటౌన్, జూన్ 16(ఆంధ్రజ్యోతి): రైతు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సోమవారం రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన రైతునేస్తం కార్యక్రమంలో కలెక్టర్ జితేష్ వి. పాటిల్, పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు మణుగూరు రైతు వేదికలో పాల్గొన్నారు. దమ్మపేట మండలం, మద్దెలగూడెం గ్రామంలో పామాయిల్ సాగు చేస్తూ అధిక లాభాలు సాధించిన ఆదర్శ రైతు కార్లపూడి బాలుతో సీఎం రేవంత్ రెడ్డి, వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. పామాయిల్ సాగు వివరాలు తెలుసుకున్నారు. పామాయిల్ సాగులో మెలుకువలను, సాగు విధానాన్ని, సాధించిన లాభాలను బాలు సీఎంకు వివరించారు. పామాయిల్ సాగుపై అత్యధికంగా రైతులను ప్రోత్సహించాలని సాగులో మెలుకువలను రైతులకు వివరించాలని, సోలార్ పంప్ సెట్ల వినియోగం ద్వారా రైతులకు పూర్తి అవగాహణ కల్పించి పామాయిల్ సాగు విస్తీర్ణాన్ని పెంచాలని సీఎం ఆదర్శ రైతుకు సూచించారు. రైతు నేస్తం కార్యక్రమానికి హాజరైన కలెక్టర్ జితేష్‌విపాటిల్, ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు మొక్కలు నాటారు. అనంతరం కలెక్టర్ అజోల్లా మునగ, వెదురు, సాగులపై రైతులకు అవగాహన కల్పించారు.

శభాష్ శివయ్య !

- కుమారులను ప్రభుత్వ బడిలో చేర్పించిన ఉపాధ్యాయుడు



కుమారులను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించిన ఉపాధ్యాయుడు

దుమ్ముగూడెం, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): పర్ణశాల జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాల తెలుగు టీచర్ ఉబ్బా శివయ్య తన ఇద్దరు కుమారులను అంజుబాక మండల పరిషత్ ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో సోమవారం చేర్పించారు. వారు ఇప్పటి వరకు లక్ష్మీనగరంలోని ఓ ప్రైవేటు పాఠశాలలో చదివారు. బడిబాటలో భాగంగా రెండో తరగతిలో ఖుషివర్ధన్‌ను, నాల్గో తరగతిలో ఉబ్బా హర్షవర్ధన్‌కు అడ్మిషన్లు తీసుకున్నారు. పాఠశాలలో విద్యాబోధన, భోజన వసతి ఇతర సదుపాయాలు మెరుగ్గా ఉన్నాయనే కారణంగా తన పిల్లల్ని చేర్పించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం వై.పార్వతి, ఇన్‌చార్జ్ హెచ్ఎం ఏజే ప్రభాకర్, లక్ష్మీరామం పాల్గొన్నారు.

ప్రజావాణిపై విశ్వాసాన్ని కల్పించాలి

- వారంలో ఒకసారి సమీక్షించుకోండి
- సామాజిక మాధ్యమాల ద్వారా వచ్చే ఫిర్యాదులను కూడా సత్వరమే పరిష్కరించాలి
- అధికారులతో ఖమ్మం కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి



అర్జీలను స్వీకరిస్తున్న కలెక్టర్ అనుదీప్

ఖమ్మంకలెక్టరేట్, జూన్ 16(ఆంధ్రజ్యోతి): ప్రజావాణిలో అర్జీలను పరిష్కరించాలని, ఈ కార్యక్రమంపై ప్రజలకు విశ్వాసం కలిగించేలా అధికారులు వారానికోమారు సమీక్షించుకోవాలని, శాఖల వారీగా జిల్లా అధికారులు స్పందించి వాటిని పరిష్కరించాలని కలెక్టర్ దురిశెట్టి అనుదీప్ ఆదేశించారు. శుక్రవారం ఆయన నూతన కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన తర్వాత సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. ఈసందర్భంగా జిల్లా అధికారులను ఉద్దేశించి మాట్లాడారు. నిబంధనలకు అనుగుణంగా ఉన్న ప్రతి దరఖాస్తును పరిష్కరించాల్సిన బాధ్యత మనపై ఉందన్నారు. ప్రజావాణి పట్ల ప్రజలకు విశ్వాసం కల్పించేలా అధికారులు అర్జీలను పరిష్కరించాలన్నారు. వారంలో ఒక రోజు ఆశాఖ పరిధిలో వచ్చిన దరఖాస్తులపై దృష్టి సారించి ఆ సమస్యకు పరిష్కారాన్ని చూపాలన్నారు. ప్రజలను ఈ పేరుతో తిప్పించుకోవద్దని సూచించారు. ప్రతి దరఖాస్తుకు ట్రాకింగ్ పద్ధతి ఉండాలని, తద్వారా ఆ దరఖాస్తు ఎక్కడ పెండింగ్ ఉందనేది తెలుసుకునే వీలుంటుందన్నారు. శాఖల వారీగా పెండింగ్‌లో ఉన్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రజావాణి కార్యక్రమానికి విధిగా జిల్లా అధికారులు హాజరు కావాలని, అత్యవసర పరిస్థితుల్లో రాలేని పక్షంలో ముందస్తు అనుమతి తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. ఎక్స్, వాట్సాప్ లాంటి సామాజిక మాధ్యమాల్లో వచ్చిన ఫిర్యాదులను కూడా పరిష్కరించాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు పి. శ్రీజ, పి. శ్రీనివాసరెడ్డి, డీఆర్వో పద్మశ్రీ, జడ్పీ సీఈవో దీక్ష రైనా, డీఆర్డీవో సన్యాసయ్య, జిల్లా అధికారులు డీపీవో ఆశాలత, డీఎంహెచ్‌వో డాక్టర్ కళావతీబాయి, ఆర్ఎంవో డాక్టర్ బి రాంబాబు, ఉపాధికల్పన అధికారి ఎన్ మాధవి, కలెక్టరేట్ ఏవో స్వామి తదితరులు పాల్గొన్నారు.

ప్రజావాణిలో అందిన ఫిర్యాదుల్లో కొన్ని..

- వేంసూర్ మండలం బీరపల్లి గ్రామ ప్రజలు తమ గ్రామంలో ప్రభుత్వ స్థలంలో అనుమతులు లేకుండా అక్రమ నిర్మాణం చేపట్టారని వాటిని వెంటనే నిలిపివేసి ప్రభుత్వ భూమిని కాపాడాలని కోరుతూ కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు.
- ఖమ్మం నగరం శ్రీరామ్ హిల్స్ ప్రాంతానికి చెందిన వనమా ఉషారాణి ధంసలాపురం గ్రామ పరిధిలోని సర్వే నెంబర్ 194 లో 2 ఎకరాల వ్యవసాయ భూమి 2008లో రిజిస్ట్రేషన్ చేసుకున్నానని, ఆ భూమిని ఇతరులు ఆక్రమించారని, భూ భారతి చట్టం ప్రకారం ఆ పట్టా పాస్ పుస్తకం రద్దు చేసి తన పేరున పట్టా పాస్ పుస్తకం మంజూరు చేయాలని కోరుతూ కలెక్టర్‌ను వేడుకున్నారు.
- ఖమ్మం నగరం బొక్కల గడ్డ 47వ డివిజన్ కు చెందిన చాట్ల సునీత తాను 15 సంవత్సరాలుగా కిరాయి ఇళ్లల్లో ఉంటున్నానని తనకు డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు ఇప్పించాలని కోరారు.
- వేంసూర్ మండలం కందుకూరు గ్రామానికి చెందిన ప్రొద్దుటూరు నాగేశ్వరరావు తమ పంట పొలాలకు రామన్న చెరువు అలుగు నీటిని మళ్లింపు చేసి నష్టం చేస్తున్నారని, వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు.



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ రోహిత్‌రాజ్

విత్తన దందాపై ఉక్కుపాదం మోపాలి

- భద్రాద్రి కొత్తగూడెం ఎస్పీ రోహిత్ రాజు
- నెలవారీ నేర సమీక్ష నిర్వహణ

కొత్తగూడెం, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): అమాయకపు రైతులను మోసం చేస్తూ.. నకిలీ విత్తనాలను విక్రయించే వారిపై ఉక్కుపాదం మోపాలని జిల్లా ఎస్పీ రోహిత్ రాజ్ అన్నారు. సోమవారం ఎస్పీ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాలులో పోలీసు అధికారులతో నెలవారీ సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పెట్రోలింగ్, బ్లూకోర్ట్ వాహనాలతో అధికారులు, సిబ్బంది ఎల్లప్పుడు రోడ్లపై తిరుగుతూ ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు. గంజాయి వంటి మత్తు పదార్థాలు, మట్కా, జూదం లాంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తులపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రతి పోలీస్‌స్టేషన్ పరిధిలోని అన్ని ప్రదేశాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకునే విధంగా చర్యలు చేపట్టాలని తెలిపారు. ప్రాపర్టీ కేసుల్లో ప్రస్తుతం పోలీసుశాఖ వినియోగిస్తున్న సాంకేతికను ఉపయోగించి నేరస్తులను పట్టుకుని సొత్తును రికవరి చేసి బాధితులకు త్వరితగతిన అందేలా చూడాలని తెలిపారు. సైబర్ నేరాల్లో నగదును కోల్పోయిన బాధితులువెంటనే స్పందించి ఫిర్యాదు చేసినప్పుడు తక్షణమే స్పందించి వారికి అండగా ఉండాలని సూచించారు. ప్రతి పోలీస్‌స్టేషన్ పరిధిలో ఎక్కువగా రోడ్డు ప్రమాదాలు జరిగే ప్రదేశాలను గుర్తించాలన్నారు. ఈ సమావేశంలో అడిషనల్ ఎస్పీ ఆపరేషన్స్ నరేందర్, భద్రాచలం ఏఎస్పీ విక్రాంత్‌కుమార్‌సింగ్, కొత్తగూడెం, పాల్వంచ, ఇల్లెందు, మణుగూరు డీఎస్పీలు అబ్దుల్ రెహమాన్, సతీష్‌కుమార్, చంద్రభాను, రవీందర్‌రెడ్డి, డీసీఆర్బీ డీఎస్పీ మల్లయ్యస్వామి, జిల్లాలోని ఇన్‌స్పెక్టర్స్ సిబ్బంది పాల్గొన్నారు.

క్లినికల్ శిక్షణకు దరఖాస్తులు

ఖమ్మం ఖానాపురంహవేలి, జూన్ 16(ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్ ఎంఎల్‌టీ, ఒకేషనల్ కోర్సులలో 2020 మార్చి నుంచి ఉత్తీర్ణులైన విద్యార్థులకు ఒక సంవత్సరం క్లినికల్ శిక్షణకు ఈ నెల 28లోగా దరఖాస్తులు చేసుకోవాలని జిల్లా ఇంటర్మీడియట్ అధికారి కె. రవిబాబు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఖమ్మం జిల్లాలోని తిరుమలాయపాలెం, మధిర, వైరా ఏరియా ఆసుపత్రులలో శిక్షణ అందిస్తున్నట్లు తెలిపారు. శిక్షణకు ఎంపికైన అభ్యర్థులు రూ. 1000ల డీడీ రూపంలో చెల్లించాలని తెలిపారు.

మాపై దాడి చేయడం అమానుషం

- విలేకరుల సమావేశంలో దళిత మహిళలు

కామేపల్లి, జూన్ 16(ఆంధ్రజ్యోతి): మహిళలమని కూడా చూడకుండా దాడి చేసి గాయపరిచారని పింజరమడుగు గ్రామానికి చెందిన దళిత కుటుంబ సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. తాళ్లగూడెంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో చిప్పలపల్లి ఆనంద్ కుమార్తెలు మాట్లాడారు. ఆదివారం మానాన్నను ఎందుకు కొట్టారని అదే గ్రామానికి చెందిన అధికార పార్టీ నాయకులను ప్రశ్నించామని, ప్రశ్నిస్తే తమపై దాడులు చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. మహిళలమని కూడా చూడకుండా కర్రలతో దాడి చేశారని తెలిపారు. ఇదే విషయంపై పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశామని తెలిపారు.

ఖమ్మం జిల్లా జనరల్ ఆస్పత్రి డిప్యూటీ సూపరింటెండెంట్‌గా కిరణ్



జిల్లా ఆస్పత్రి డిప్యూటీ సూపరింటెండెంట్‌గా నియమితులైన కిరణ్‌కుమార్‌ను అభినందిస్తున్న దృశ్యం

ఖమ్మం కలెక్టరేట్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): ఖమ్మం జిల్లా జనరల్ ఆస్పత్రి డిప్యూటీ సూపరింటెండెంట్‌గా డాక్టర్ బి. కిరణ్‌కుమార్‌ను నియమించారు. ఈమేరకు వైద్యకళాశాల ప్రిన్సిపాల్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో ఆయన్ను ఆస్పత్రిలో పలువురు అభినందించారు. గతంలో ఆయన ఆస్పత్రి సూపరింటెండెంట్‌గా ఏడాదిపాటు విధులు నిర్వర్తించారు. ప్రస్తుతం ఎల్ కిరణ్‌కుమార్ సూపరింటెండెంట్‌గా వ్యవహరిస్తుండగా డిప్యూటీ సూపరింటెండెంట్‌గా బి. కిరణ్‌కుమార్‌ను నియమించారు. సోమవారం ఆయన బాధ్యతలు చేపట్టారు. ఆయనను సూపరింటెండెంట్ ఎల్. కిరణ్‌కుమార్, ఏడీ సంతోష్, ఏవో రవికిశోర్ తదితరులు అభినందించారు.

జగ్గయ్యపేటను మరిచారు..

గ్రీన్‌ఫీల్డ్ హైవే అధికారుల నిర్వాకం

వైరా, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): గ్రీన్‌ఫీల్డ్ హైవే అధికారులు వైరా-మధిర, జగ్గయ్యపేట రోడ్డులో సోమవరం ఎగ్జిట్ సమీపంలో ఎంతో కీలకమైన జగ్గయ్యపేట పేరుతో బోర్డు ఏర్పాటు చేయకుండా విస్మరించారు. రెండు తెలుగు రాష్ట్రాలతోపాటు అనేక రాష్ట్రాలకు వైరా-మధిర, జగ్గయ్యపేట రోడ్డు కీలకంగా ఉంది. ఈ రోడ్డు నుంచే గ్రీన్‌పీల్డ్ హైవే రోడ్డు నిర్మాణం జరుగుతుంది. ఖమ్మం-దేవరపల్లి మధ్య నిర్మిస్తున్న ఎన్‌హెచ్-365బీజీ గ్రీన్‌ఫీల్డ్ హైవే రోడ్డులో 33.604కిలోమీటర్ వద్ద సోమవరం సమీపంలో ఎగ్జిట్‌ను ఏర్పాటుచేశారు. వైరా-మధిర, జగ్గయ్యపేట రోడ్డులో అండర్‌పాస్ హైలెవల్ వంతెన నిర్మించి ఎగ్జిట్ ఏర్పాటుచేశారు. భద్రాచలం తదితర ప్రాంతాల వారు ఈ ఎగ్జిట్ నుంచే హైదరాబాద్‌కు రాకపోకలు కొనసాగిస్తారు. అయితే దేవరపల్లి, అశ్వారావుపేట, సత్తుపల్లి, కల్లూరు ప్రాంతాల నుంచి గ్రీన్‌ఫీల్డ్ హైవేపై వచ్చే వాహనాలు మధిర, జగ్గయ్యపేట వెళ్లేందుకు సోమవరం ఎగ్జిట్ వద్దే దిగాల్సి ఉంది. ఆప్రాంతాలకు మధిర, జగ్గయ్యపేట నుంచి వెళ్లే వాహనాలు కూడా గ్రీన్‌ఫీల్డ్ హైవే రోడ్డులో ఎక్కాల్సి ఉంది. జగ్గయ్యపేట నుంచి సత్తుపల్లి, అశ్వారావుపేట తదితర ప్రాంతాలకు సిమెంట్ ఎగుమతి అలాగే సత్తుపల్లి నుంచి జగ్గయ్యపేటకు బొగ్గు రవాణా జరుగుతుంది. అలాంటి ఎగ్జిట్‌కు రెండువైపులా ఇంగ్లీష్, తెలుగుల్లో కేవలం వైరా-మధిర పేర్లతోనే బోర్డు ఏర్పాటుచేశారు. కీలకమైన జగ్గయ్యపేట పేరుతో ఎగ్జిట్‌కు రెండువైపులా ఒక్క బోర్డు కూడా ఏర్పాటు చేయలేదు. ఈ ఎగ్జిట్ నుంచే జగ్గయ్యపేట వెళ్లే దారిలో చిల్లకల్లు వద్ద హైదరాబాద్-విజయవాడ మీదుగా చెన్నై, వైజాగ్ వెళ్లే జాతీయ ప్రధాన రహదారి ఉంది. ఈ ఎగ్జిట్ నుంచి జగ్గయ్యపేట 48కిలోమీటర్లు, చిల్లకల్లు 43కిలోమీటర్ల దూరం ఉంది. కొత్తగూడెం నుంచి జగ్గయ్యపేట వరకు వందకిలోమీటర్ల రెండులైన్ల రోడ్డును జాతీయ ప్రధాన రహదారి పరిధిలోకి తీసుకువెళ్లి నాలుగులైన్ల రోడ్డుగా అభివృద్ధి చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఇప్పటికే రెండుసార్లు కేంద్ర జాతీయ రహదారుల శాఖమంత్రి నితిన్ గడ్కరీకి ప్రతిపాదనలు అందించారు.



గ్రీన్‌ఫీల్డ్ హైవేపై వైరా-మధిర పేర్లతో ఏర్పాటు చేసిన బోర్డు

కొత్తగూడెం నుంచి కూడా గ్రీన్‌ఫీల్డ్ హైవే అండర్‌పాస్ హైలెవల్ వంతెన కింద నుంచే వేలాది వాహనాల రాకపోకలు కొనసాగిస్తున్నాయి. ఎంతో ప్రాధాన్యత కల్గిన జగ్గయ్యపేట, చిల్లకల్లు పేర్లతో సోమవరం ఎగ్జిట్‌కు రెండ ఉవైపులా బోర్డులు ఏర్పాటుచేయటంలో గ్రీన్‌ఫీల్డ్ హైవే అధికారులు నిర్లక్ష్యం చూపారనే విమర్శలు విన్పిస్తున్నాయి. ఇప్పటికైనా జగ్గయ్యపేట, చిల్లకల్లు పేర్లతో ఎగ్జిట్‌కు రెండువైపులా వాహనదారులకు సౌకర్యం కోసం బోర్డులు ఏర్పాటుచేయాలని పలువురు కోరుతున్నారు.

కలెక్టర్‌కు ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కమిటీ వినతి

ఖమ్మంసంక్షేమవిభాగం, జూన్16 (ఆంధ్రజ్యోతి): విద్యాసంవత్సరం ప్రారంభమైన ప్రభుత్వ గురుకులాల ఆర్సీవోలు విద్యార్థులకు అందుబాటులో ఉండటం లేదని, విద్యార్థులకు వారి తల్లి, దండ్రులకు అధికారులు కార్యాలయాల్లో ఉండేలా చర్యలు తీసుకోవాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కమిటీ కార్యదర్శి తుడుం ప్రవీణ్ విన్నవించారు. సోమవారం ప్రజావాణిలో కలెక్టర్ అనుదీప్‌ను కలిసి నాయకులు వినతిపత్రం అందించారు. ప్రత్యేకంగా పలువురు అధికారులపై ఫిర్యాదులు చేయటంతో సంబంధిత అధికారులను కలెక్టర్ వెంటనే పిలిపించి మాట్లాడారు. నాయకులు రాజు, త్రీనాథ్, లోకేష్, ఉదయ్, మణికంఠ, భాను పాల్గొన్నారు.

ఫిర్యాదులపై తక్షణ పరిష్కారం

» కమిషనర్ అభిషేక్ అగస్త్య



వివరాలు తెలుసుకుంటున్న కమిషనర్

ఖమ్మంసంక్షేమ విభాగం, జూన్16 (ఆంధ్రజ్యోతి): ప్రజలు అందించే ప్రతీ ఫిర్యాదుపై అధికారులు తక్షణ పరిష్కారం చూపాలని ఖమ్మం నగర పాలక సంస్థ కమిషనర్ అభిషేక్ అగస్త్య ఆదేశించారు. ఖమ్మం నగర పాలక సంస్థ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో కమిషనర్ నేరుగా ప్రజల నుంచి వనతులు స్వీకరించారు. ప్రజలు అందించిన ఫిర్యాదులపై సంబందిత అధికారులను పిలిపించి వెంటనే చర్యలకు కమిషనర్ ఆదేశించారు. 3వ డివిజన్‌లో జయనగర్ కాలనీ నుంచి బీసీ కాలని వరకు రహదారి నిర్మాణం చేయాలని మలీదు మనిష్ కమిషనర్‌ను కోరారు. డ్రైయినేజీ సమస్యలు వివరించారు. త్వరలో జోనల్ కార్యాలయాన్ని ప్రారంభించాలని విన్నవించారు. 15వ డివిజన్‌లో తమస్థలానికి సమీపంలోనే అక్రమ నిర్మాణాలు జరుగుతున్నాయని వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు. 32వ డివిజన్‌లో ఇంటి నెంబర్లు కోసం, 27వ డివిజన్‌లో తాగునీటి కనెక్షన్‌లకోసం విన్నవించారు. ఏఎంసీ ఆహ్మద్‌షఫీఉల్లా పాల్గొన్నారు.

సొంతింటి కల నెరవేర్చేలా కృషి

» పెండింగ్ లబ్ధిదారుల ఎంపిక ఏడు రోజుల్లో పూర్తి చేయాలి
» కలెక్టర్ అనుదీప్ సమీక్ష
» ఇందిరమ్మ, డబుల్ బెడ్ రూమ్ ఇళ్లపై సమీక్ష



అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ అనుదీప్

ఖమ్మంకలెక్టరేట్, జూన్16(ఆంధ్రజ్యోతి): పేదల సొంతింటికల నెరవేర్చేందుకు ప్రణాళికాబద్ధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఆయన అదనపు కలెక్టర్ పి.శ్రీజతో కలిసి ఇందిరమ్మ, డబుల్ బెడ్ రూమ్ ఇళ్లపై అసెంబ్లీ నియోజకవర్గ ప్రత్యేక అధికారులతో సమీక్షించారు. ప్రతీఅసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో3,500ఇందిరమ్మ ఇళ్ల పూర్తిస్థాయిలో మంజూరు ప్రక్రియ వేగవంతం చేయాలన్నారు. ప్రతీమండలం, గ్రామానికి మొదటి విడతలో కేటాయించిన ఇందిరమ్మ ఇళ్ల సంఖ్య ప్రకారం, లబ్ధిదారుల ఎంపిక పారదర్శకంగా జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఇందిరమ్మ కమిటీల నుంచి వచ్చిన జాబితాను మరోసారి ధృవీకరణ చేసి ఇళ్ల మంజూరు చేయాలని కలెక్టర్ సూచించారు.ఇళ్ల మంజూరు ప్రక్రియ వేగవంతం చేయాలని,పెండింగ్ ఇందిరమ్మ లబ్ధిదారుల ఎంపిక, ప్రొసిడింగ్స్ పంపిణీ ప్రక్రియ వారంలో పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. జిల్లాలో లబ్ధిదారులకు పంపిణీ చేయకుండా పూర్తి చేసిన డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల రిపోర్ట్ అందించాలని అన్నారు. పురోగతిలో ఉన్న డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను పూర్తి చేసేందుకు అవసరమైన నిధుల ప్రతిపాదనలు సిద్ధం చేయాలని, వీటిని సొంత భూమి లేని నిరుపేదలకు కేటాయించాలన్నారు. స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శ్రీజ మాట్లాడుతూ పైలెట్ గ్రామాల్లో గ్రౌండ్ చేసినట్లు తెలిపారు. ప్రతి నియోజకవర్గానికి 3,500 చొప్పున ఇందిరమ్మ ఇళ్ల మంజూరుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పీ సీఈవో దీక్షా రైనా, హౌజింగ్ పీడీ భూక్యా శ్రీనివాస్, జిల్లా పంచాయతీ అధికారి ఆశాలత, డీపీవో రాంబాబు, ఆర్డీఓలు జి. నరసింహరావు, ఎల్. రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

హామీల అమలులో ప్రభుత్వం విఫలం

సీపీఐ జాతీయ సమితి సభ్యుడు బాగం

చింతకాని, జూన్16 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని సీపీఐ జాతీయ సమితి సభ్యుడు బాగం హేమంతరావు అన్నారు. సోమవారం చింతకాని మండలంలో ఆ పార్టీ 17వ మహాసభ లచ్చగూడెంలో అమరజీవి బాల నాగేందర్ రెడ్డి ప్రాంగణంలో నిర్వహించారు. తొలుత మహాసభల ప్రారంభ సూచికంగా ఏర్పాటు చేసిన అరుణ పతాకాన్ని భాగం హేమంతరావు ఆవిష్కరించారు. అమర వీరుల స్మారక స్థూపానికి నివాళులర్పించారు. పార్టీ అన్ని వర్గాల ప్రజల కోసం పోరాటాలు చేస్తుందన్నారు. కమ్యూనిస్టు పార్టీలు చేసిన పోరాటాలు నేటి యువత తెలుసుకోవాలన్నారు. కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు అవలంబిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలపై పోరాటాలు సాగించాలన్నారు. అనంతరం పార్టీ మండల కమిటీను ప్రకటించారు. కార్యదర్శిగా దూసరి గోపాలరావు, సహాయ కార్యదర్శులుగా అబ్బూరి మహేష్, మార్గం శ్రీనుతో పాటు 48 మందితో కమిటీ ఎన్నుకున్నారు.

ట్రాఫిక్ నియమాలు పాటించాలి

» ఏసీపీ శ్రీనివాసులు



విద్యార్థులకు ట్రాఫిక్ నియమాలు వివరిస్తున్న ఏసీపీ

ఖమ్మంఖానాపురంహవేలి, జూన్16 (ఆంధ్రజ్యోతి): ట్రాఫిక్ నియమాలు పాటించాలని ట్రాఫిక్ ఏసీపీ శ్రీనివాసులు అన్నారు. సోమవారం ట్రాఫిక్ నియమాల ప్రాముఖ్యతపై పాఠశాల విద్యార్థులకు అవగాహన కల్పించారు. రిక్కాబజార్ పాఠశాల విద్యార్థులకు అవగాహన కల్పించారు. ట్రాఫిక్ నియమాల ప్రాముఖ్యతను విద్యార్థులకు చిన్న తనం నుంచే నేర్పించటం ద్వారా క్రమశిక్షణ, బాధ్యతలను గుర్తు చేస్తాయన్నారు. రోడ్డు ప్రమాదాలు గణనీయంగా తగ్గుతాయన్నారు. డ్రైవింగ్ చేస్తున్నప్పుడు సెల్‌ఫోన్ మాట్లాడుతూ తరుచుగా పరధ్యానంలో ఉంటూ ప్రమాదాలకు గురిఅవుతున్నారన్నారు. హెల్మెట్లు, సీటు బెల్టులు వంటి భద్రతా సామగ్రి వినియోగంతో డ్రైవర్లకు రక్షణ కవచంలా పని చేస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ సిఐ సత్యనారాయణ, ఆర్ఐ సాంబశివరావు, ఎస్సై రవి, రాము పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ నేతల నిరసన



నిరసన తెలుపుతున్న నాయకులు

ఖమ్మంమార్కెట్, జూన్16(ఆంధ్రజ్యోతి): బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు ఏసీబీ విచారణ నోటీసులు జారీ చేసినందుకు నిరసనగా సోమవారం రాజ్యసభ ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, మాజీమంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ ఆధ్వర్యంలో ఖమ్మం నియోజకవర్గం బీఆర్‌ఎస్ నాయకులు హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌కు చేరుకొని నిరసన వ్యక్తం చేశారు. ఏసీబీ నోటీసులను వారు ఖండిస్తూ ప్రభుత్వం విపక్షాలపై కక్ష పూరితంగా వ్యవహరించడం తగదని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో జిల్లా బీఆర్‌ఎస్ నాయకుడు మాజీ జెడ్పీటీసీ లింగాల కమల్‌రాజ్, మాజీ డీసీసీబీ చైర్మన్ కూరాకుల నాగభూషయ్య, నగర అధ్యక్షుడు పగడాల నాగరాజు, బచ్చు విజయ్‌కుమార్, వీరునాయక్, కార్పొరేటర్లు వలరాజు, నాగండ్ల కోటి, బుర్రి వెంకట్, జ్యోతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రుణమాఫీ ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదే

» మేయర్ పునుకొల్లు నీరజ
» అల్లీపురం రైతు నేస్తం కార్యక్రమానికి హాజరు



సమావేశంలో పాల్గొన్న మేయర్ పునుకొల్లు నీరజ

ఖమ్మంసంక్షేమవిభాగం, జూన్16(ఆంధ్రజ్యోతి): దేశంలో ఏరాష్ట్ర ప్రభుత్వం అమలు చేయలేని విధంగా రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రూ.2లక్షల రైతు రుణమాఫీ అమలు చేశారని మేయర్ పునుకొల్లు నీరజ పేర్కొన్నారు. సోమవారం 15వ డివిజన్ అల్లీపురం రైతు వేదికలో నిర్వహించిన రైతు నేస్తం కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షుడు రావూరి సైదుబాబు, కార్పొరేటర్ రావూరి కరుణతో కలిసి మేయర్ పాల్గొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రైతురుణమాఫీ సందేశాన్ని రైతులతో కలిసి విన్నారు. అనంతరం రైతులతో మేయర్ మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలపై ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాలన్నారు. డీసీసీబీ బ్యాంకు చైర్మన్ దొండపాటి వెంకటేశ్వరరావు, ఏవో కిషోర్, ఏఈవో దివ్య, మనిషా, రైతులు సంక్రాంతి నాగేశ్వరరావు, వెనిగల సత్యనారాయణ, చేతుల నాగేశ్వరరావు, పత్తిపాటి వీరయ్య తదితరులు పాల్గొన్నారు. రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు కృతజ్ఞతలు తెలిపారు.





రూరల్, తిరుమలాయపాలెం మండలాల్లో సీఎం ప్రసంగం వింటున్న అధికారులు, రైతులు

'రైతు నేస్తం' వీక్షించిన కర్షకులు

ఖమ్మంరూరల్: రైతువేదికల్లో నిర్వహించిన రైతునేస్తం కార్యక్రమ వీక్షణకు రైతులు, అధికారులు హాజరయ్యారు. రాష్ట్ర వ్యాప్తంగా రైతు వేదికలకు వీడియో కాన్ఫరెన్స్ కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. మండలంలోని పోన్నేకల్లు, గొళ్లపాడు రైతు వేదికలలో రైతులు, అధికారులు ప్రత్యక్ష ప్రసారాన్ని వీక్షించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటి సీఎం భట్టి విక్రమార్క మాట్లాడారు. ఇప్పటివరకు ప్రభుత్వం రూ.70వేల కోట్లు ఖర్చు చేసినట్లు తెలిపారు. సోలార్ పంప్ సెట్లు రైతులు ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ రాంప్రసాద్, ఏవో ఉమా నగేష్, ఎంపీడీవో కుమార్ పాల్గొన్నారు.

తిరుమలాయపాలెం: మండలంలోని వివిధ గ్రామాల్లో రైతువేదికల్లో సోమవారం నిర్వహించిన రైతునేస్తం వీడియోకాన్ఫరెన్సులో వివిధ శాఖల అధికారులు, రైతులు వీక్షించారు. మండలంలోని తిరుమలాయపాలెం,దమ్మాయిగూడెం, బీరోలు తదితర గ్రామాల్లోని రైతువేదికల్లో వీసీ ద్వారా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు నిర్వహించిన వీసీని రైతులు వీక్షించారు. ఈకార్యక్రమంలో తహసీల్దార్ లూథర్‌విల్సన్,ఎంపీడీవో సిలార్‌సాహెబ్, ఏవో సీతారాంరెడ్డి, ఏఈవోలు నవీనత, బాలకృష్ణ, రమేష్ పాల్గొన్నారు.

పరిశుభ్రతతోనే డయేరియా నిర్మూలన

» జూలై 31 వరకు జింకు మాత్రలు పంపిణీ
» డీఎంహెచ్‌వో కళావతిబాయి



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న డీఎంహెచ్‌వో కళావతిబాయి, డీఐవో చందునాయక్

రఘునాథపాలెం,జూన్ 16(ఆంధ్రజ్యోతి): ప్రతీ ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రతతో పాటుగా పరిసరాలు పరిశుభ్రత పాటించటం ద్వారా డయేరియాను పూర్తిస్థాయిలో అదుపులో ఉంటుందని జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారి కళావతిబాయి సూచించారు.సోమవారం రఘునాథపాలెం మండలం వీ-వెంకటాయపాలెం ఆరోగ్య ఉపకేంద్రంలో జాతీయ అతిసారం అవగాహన కార్యక్రమాన్ని డీఎంహెచ్‌వో ప్రారంభించారు. ఐదేళ్లలోపు చిన్నారులకు జింకు మాత్రలను పంపిణీ చేశారు. వచ్చేనెల 31 వరకు ఈ మాత్రలను జిల్లావ్యాప్తంగా పంపిణీ చేస్తామని చెప్పారు. చంటిపిల్లలు, బాలింతలు, పిల్లల తల్లులతో అవగాహన సమావేశం నిర్వహించారు. ప్రజలు అతిసారం, వైరల్, టైఫాయిడ్, సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు.జిల్లా టీకాల అధికారి చందునాయక్ మాట్లాడుతూ గర్భిణీల నమోదు నుంచి వ్యాధి నిరోధక టీకాలు అవశ్యకత, పిల్లల తల్లులు ఆరోగ్యంపై పలు సూచనలు చేశారు. మండల వైద్యాధికారి నంద్యాల బాలకృష్ణ, ఏఎన్ఎం మేడా పుష్పావతి, హెల్త్ అసిస్టెంట్ కృష్ణయ్య, ఎంఎల్‌హెచ్‌పీ మౌనిక, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

పది ర్యాంకర్లకు నగదు ప్రోత్సాహకాల పంపిణీ



వైరా,జూన్16(ఆంధ్రజ్యోతి): మండలంలోని సిరిపురం హైస్కూల్లో ఈ ఏడాది మార్చిలో జరిగిన పదోతరగతి పరీక్షల్లో అత్యుత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు తన భర్త కందిబండ బాలమురళీ కృష్ణ జ్ఞాపకార్థం ఆయన సతీమణి శైలజా రాణి, కుమారులు రూ.22వేల నగదు ప్రోత్సాహకాలను సోమవారం అందజేశారు. మొదటిస్థానం సాధించిన గుమ్మా నిరంజన్‌కు రూ.11వేలు, ద్వితీయ స్థానం సాధించిన యంగల హర్షకు రూ.ఐదు వేలు, మూడోస్థానం సాధించిన కూరాకుల అలేఖ్యకు రూ.4వేలు, నాల్గోస్థానం సాధించిన పూజల నాగవైష్ణవికి రూ.2వేలు నగదు ప్రోత్సాహకాలను పంపిణీ చేశారు. ప్రధానోపాధ్యాయురాలు సూర్యకుమారి, గ్రామస్థులు పాల్గొన్నారు.

ఇంటర్ అడ్వాన్స్‌డ్

ఫలితాల్లో న్యూవిజన్ విజయభేరి



విద్యార్థులతో కళాశాల చైర్మన్ ప్రసాద్

ఖమ్మంఖానాపురంహవేలి, జూన్16 (ఆంధ్రజ్యోతి): సోమవారం ప్రకటించిన ఇంటర్మీడియట్ సప్లిమెంటరీ ఫలితాల్లో న్యూవిజన్ కళాశాల విద్యార్థులు రాష్ట్రస్థాయి అత్యుత్తమ మార్కులు సాధించారని విద్యాసంస్థల చైర్మన్ సిహెచ్‌జీకె.ప్రసాద్ తెలిపారు. జూనియర్ ఎంపీసీ విభాగంలో 470మార్కులకు యు.శ్రుతి యస్. గ్రీష్మిత, వి.లక్ష్మీస్నేహిత, పి. అవినాష్, కె.నేహశ్రీ, 468, కె.సాయిసాత్విక్, యం.శ్రీరోషిణి, కె.శేషుకుమార్,యం.ప్రహర్షిణి, యం కిద్విత, పి.సాత్విక పలువురు విద్యార్థులు,467 మార్కులు సాధించారని తెలిపారు. బైపీసీలో ఎ.విద్యాశ్రీ, కె.ఆరోణ్ నిహాల్రాయ్, జి. స్పందన, అమతున్నూర్నధియా, బి.అర్పిత, బి.నాగలోకేష్, ఎండి.ఇనాన్436మార్కులు,రోషిణి, టి.గోమతి 435, కె.గుణశేషు, బి. శశాంక్ 434, కె.యశశ్విని మాహీర మెహ్రోజ్ 433, బి. శరణ్య, కె.హాసిని, టి.సాత్విక432 తోపాటు పలువురు విద్యార్థులు అత్యుత్తమ మార్కులు సాధించారని తెలిపారు. రాష్ట్రస్థాయిలో మొదటటి 10ర్యాంకులలో ఎంపీసీ నుంచి 252, బైపీసీ నుంచి 38మంది విద్యార్థులు ఉండటం చరిత్రలోనే న్యూవిజన్ మొదటి కళాశాల అని నిరూపించుకుందన్నారు.విద్యార్థులను డైరెక్టర్ గోపిచెంద్, అకాడమిక్ డైరెక్టర్ కార్తీక్, ప్రిన్సిపాల్ బ్రహ్మచారి, శ్రీనివాసరావు అభినందించారు.

బీజేపీలో 60 కుటుంబాల చేరిక



ఖమ్మంమార్కెట్, జూన్16(ఆంధ్రజ్యోతి): నగరంలోని త్రీటౌన్ ప్రాంతం నుంచి సోమవారం సుమారు 60కుటుంబాలు బీజేపీలో చేరాయి. త్రీటౌన్ ప్రాంతంలో కేంద్రంలో మోదీ 11సంవత్సరాల సంక్షేమ పాలనపై జరిగిన ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈక్రమంలో త్రీటౌన్ మండల అధ్యక్షురాలు దార్ల మల్లీశ్వరి శంకర్‌గౌడ్ ఆధ్వర్యంలో ఇతర పార్టీలకు చెందిన కార్యకర్తలను బీజేపీ జిల్లా అధ్యక్షుడు నెల్లూరి కోటేశ్వరరావు వారికి పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు.ఈ కార్యక్రమంలో నాయకులు గుత్తా వెంకటేశ్వర్లు, పిట్టల వెంకటనర్సయ్య, రుద్ర ప్రదీప్, కొణతం లక్ష్మీనారాయణ, ప్రవీణ్,అనిత తదితరులు ఉన్నారు.

సామూహిక అక్షరాభ్యాసాలు

తిరుమలాయపాలెం,జూన్16(ఆంధ్రజ్యోతి): మండలంలోని తెట్టెలపాడు మూడో అంగన్‌వాడీ కేంద్రంలో సోమవారం సామూహిక అక్షరాభ్యాసం నిర్వహించారు. సీడీపీవో కవిత ప్రారంభించారు. పోషణతోపాటు ప్రీస్కూల్ బుక్స్ ద్వారా పిల్లల మేధస్సుపెంచే విధంగా ఆటపాటలు, కథలతో వత్తిడిలేని విద్య అందిస్తున్నట్టు తెలిపారు. ఈకార్యక్రమంలో సూపర్‌వైజర్ సావిత్రి,హెచ్‌ఎం లాలయ్య,ఉపాధ్యాయులు ఉపేందర్‌రావు,అంగన్‌వాడీ టీచర్లు రమాదేవి, మంగతాయమ్మ, అప్పమ్మ పాల్గొన్నారు.

టీబీ పరీక్షలు చేయించుకోవాలి

ఏన్కూరు, జూన్16(ఆంధ్రజ్యోతి): టీబీవ్యాధి లక్షణాలున్న ప్రతీ ఒక్కరు పరీక్షలు తప్పనిసరిగా చేయించుకోవాలని జిల్లా టీబీ నిర్మూలన అధికారి సుబ్బారావు చెప్పారు. సోమవారం జన్నారంలో ప్రధానమంత్రి టీబీ ముక్త్‌భారత్ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. ఆరునెలలు మందులను వాడితే వ్యాధి పూర్తిగా నయమవుతుందన్నారు. అనంతరం పీహెచ్‌సీ వైద్యులు రాములు వ్యాధి లక్షణాలపై అవగాహన కలిపించారు.

వరద ప్రభావిత ప్రాంతాల్లో అప్రమత్తంగా ఉండాలి

» ఎన్డీఆర్‌ఎఫ్ ఇన్‌స్పెక్టర్ గౌతమ్



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న అధికారులు

ఖమ్మంరూరల్,జూన్16(ఆంధ్రజ్యోతి): వరద ప్రభావిత ప్రాంత ప్రజలు వరదల సమయంలో అప్రమత్తంగా ఉండాలని ఎన్డీఆర్‌ఎఫ్ ఇన్‌స్పెక్టర్ గౌతమ్ వరద ముంపుప్రాంత ప్రజలకు సూచించారు. ఏదులాపురం మునిసిపాలిటీ పరిధిలోని తహసీల్దార్ రాంప్రసాద్, మునిసిపల్ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డితో కలిసి రాజీవ్‌గృహకల్పలో సోమవారం ప్రజలకు అవగాహన సదస్సు నిర్వహించారు. విపత్తులు వచ్చినప్పుడు తీవ్ర నష్టం జరుగుతుందన్నారు. గత ఏడాది అనుభవాలను దృష్టిలో ఉంచుకుని మున్నేరు వరద ప్రభావిత ప్రాంతాల ప్రజలు ముందు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. వర్షాకాలం మొత్తం ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.వరదల సందర్భాల్లో ప్రజలు తమ విలువైన ఆస్తులను కాపాడుకోవడం కోసం కొన్ని జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. బంగారం, ఆస్తి, విలువైన పత్రాలు, సర్టిఫికెట్లు అత్యవసరమైన వస్తువులను అన్నింటిని వకేచోట దాచుకోవాలన్నారు. వరదలసమయంలో సురక్షిత ప్రాంతాలకు వాటిని తీసుకుని వెళ్లేందుకు వీలుగా ఉంచుకోవాలన్నారు. గతసెప్టెంబరులో వచ్చిన వరదల కారణంగా అనేక మంది కట్టుబట్టలతో బయటకు వెళ్లాల్సి వచ్చిందన్నారు. విలువైన వస్తువులు నీటి పాలయ్యాయన్నారు. వాతావరణ సూచనలు గమనిస్తూ పిల్లలు, వృద్ధుల పట్ల ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.ప్రమాదం నుంచి మనల్ని మనమే కాపాడుకుంటూనే ఇతరులను కాపాడేందుకు ప్రయత్నం చేయాలన్నారు.

శిథిలావస్థలో గోపాలపురం పాఠశాల





గోపాలపురం పాఠశాలలో పెచ్చులూడుతున్న స్లాబు

తిరుమలాయపాలెం,జూన్16(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలలను ప్రైవేటు పాఠశాలలకు దీటుగా అభివృద్ధి పరుస్తున్నామని ప్రభుత్వం గొప్పలు చెప్పుకున్నా,ఆచరణలో సాధ్యం కావడం లేదు. ప్రభుత్వ పాఠశాలల్లో కనీస మౌళిక సదుపాయాలు లేక ఆయా గ్రామాల్లో విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలలకు వెళ్లకుండా ప్రైవేటు పాఠశాలలకే మొగ్గుచూపుతున్నారు. మండలంలోని గోపాలపురం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో మౌళికసదుపాయాలు లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇక్కడ సుమారు 15మంది పిల్లలు ప్రస్తుతం చదువుకుంటున్నారు పాతభవనం కావడంతో విద్యార్థులుఇబ్బందులు పడుతున్నారు. గోడలు, కిటికీలు బీటలు వారాయి స్లాబు పైకప్పు పెచ్చులూడాయి. పాఠశాల భవనం మొత్తం శిథిలావస్థలో ఉంది. ఎప్పుడు కూలి ఏప్రమాదం సంభవిస్తుందోనని ఆందోళన చెందుతున్నారు. భవనం గోడల మధ్య మర్రిచెట్టు మొలిచింది. శిథిలావస్థలో ఉన్న పాఠశాల భవనం తొలిగించాలని అధికారులకు, ప్రజాప్రతినిధులకు విన్నవించినా పట్టించుకోవడంలేదని గ్రామస్తులు చెబుతున్నారు.



ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు ఎమ్మెల్యే వినతి

సత్తుపల్లి, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): మొదటి విడతలో ఇందిరమ్మ ఇళ్లు మంజూరైన సత్తుపల్లి మునిసిపాలిటీతోపాటు నియోజకవర్గంలోని 5మండలాల లబ్ధిదారులు ఆయా అనుమతుల కోసం దరఖాస్తు చేసుకోవాలని సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి, కాంగ్రెస్ పార్టీ నాయకులు డాక్టర్ మట్టా దయానంద్ సోమవారం తెలిపారు. నూతనంగా విద్యుత్ కనెక్షన్, మీటర్, నీటి కుళాయిల కోసం దరఖాస్తు చేసుకున్న వారందరికీ మంజూరు చేయాలని సంబంధిత అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు.

చప్టాలు.. పొంచి ఉన్న ప్రమాదాలు

- వర్షాకాల సీజన్‌లో పలు గ్రామాల రాకపోకలకు అంతరాయం
- ప్రమాద హెచ్చరికలకే పరిమితమవుతున్న యంత్రాంగం
- శాశ్వత చర్యలపై దృష్టిసారించని అధికారులు..



రహదారిలో ప్రమాదకరంగా ఉన్న చప్టా

కల్లూరు, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): వర్షాకాలంలో వరదలతో కల్లూరు మండలంలోని పలు గ్రామాలకు అనుసంధానంగా గల ప్రధాన రహదారుల(చప్టాల)పై ప్రమాదం పొంచి ఉంది. వరదలు వచ్చిన సందర్భంలో మండలంలోని పలు గ్రామాల్లో చెరువులు నిండి వరదనీటి ప్రవాహం ప్రధాన రహదారులపై గల చప్టాలపై నుంచి పొంగి ప్రవహిస్తుంది. ఈ సమయంలో ప్రభుత్వ అధికారులు ప్రమాదకరంగా మారిన రహదారులపై వెళ్లే ప్రజలను అప్రమత్తం చేసేందుకు ప్రమాద హెచ్చరికలు జారిచేస్తారే కానీ, వాటి నుంచి శాశ్వతంగా రక్షణ పొందేలా చర్యలు తీసుకోవడంపై దృష్టి పెట్టడం లేదు. అందుకు నిదర్శనంగా కల్లూరు మండల పరిధిలోని కల్లూరు టు లక్ష్మీపురం వెళ్లే రహదారి వైపున భారీ వర్షాలు కురసినపుడు పెద్దచెరువు అలుగు వరద నీరు చప్టాపై నుంచి ప్రవహించడంతో రాక పోకలకు అంతరాయం కలగుతోంది. ఈ సమయంలో అధికారులు ఈ ప్రదేశాన్ని ప్రమాద హెచ్చరికగా ప్రకటించి రాకపోకలను నిలిపేస్తారు. ఇంకా మండలంలోని కల్లూరు టు మధిర రహదారిపై పోచారం గ్రామం వద్ద గల పెద్ద చెరువు వరదనీరు (చప్టా) ప్రవహించడంతో ఈ ప్రదేశాన్ని కూడా ప్రమాదకరంగా గుర్తించారు. మండలంలోని తాళ్లూరు టు వెంకటాపురం గ్రామం మధ్యన గల ప్రధాన రహదారిపై గల చప్టాపై నుంచి స్థానికంగా గల మరో పెద్దచెరువు నుంచి వరద నీరు ప్రవాహించడంతో ఈ ప్రదేశాన్ని కూడా ప్రమాదకర హెచ్చరికగా గుర్తించారు. ఇటుగా వెళ్లే వాహనాల, ప్రజల రాకపోకలకు వరదల సమయంలో అంతరాయంతో పాటుగా ప్రమాదకరంగా మారనున్నది. మండలంలోని పలు గ్రామాలకు అనుసంధానంగా గల ఆయా రహదారులపై ఆనాదిగా చప్టాలు నిర్మించారు. పెరుగుతున్న జనాభా, వాహనాల రద్దీని దృష్టిలో ఉంచుకుని అధికారులు శాశ్వత పరిష్కార చర్యలపై దృష్టిసారించడం లేదని పలు గ్రామాల ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. వరదల సమయంలోనే అధికారులు ఆయా ప్రమాదకరంగా మారిన చప్టాలపై పర్యవేక్షణ చేస్తున్నారేకాని చప్టాల స్థానంలో ఆధునీకంగా వంతెనలు నిర్మించాల్సిన ఆవశ్యకతపై ప్రభుత్వానికి తగిన ప్రతిపాదనలు పంపని పరిస్థితి. ఇటీవల మండలాల స్థాయిలో విపత్తుల నివారణ సమావేశాలు అధికార యంత్రాంగం నిర్వహించేదే కానీ, వాటి నివారణకై చేపట్టాల్సిన శాశ్వత చర్యలపై ఏ మాత్రం దృష్టిసారించడం లేదని విమర్శలు వినిపిస్తున్నాయి. మరో వైపున కల్లూరు మండలంలోని లక్ష్మీపురం గ్రామ సమీపాన అడవి ప్రాంతం నుంచి వర్షాకాలంలో భారీగా వరదనీటి ప్రవాహం వస్తుంది. దీంతో కల్లూరు పెద్దచెరువులోకి భారిగా వరదనీరు చేరి పలు గ్రామాల రహదారుల్లో వరద ప్రభావం చూపుతోంది. ఈ సీజన్‌లోనే సాగర్ కాల్వ నీరు కూడ విడుదల చేయడంతో చెరువులు నిండి ఆయా గ్రామాల ప్రధాన రహదారుల చప్టాలపై నుంచి వదర నీరు ప్రవహించడంతో ప్రమాదకర ప్రదేశాలుగా అధికారులు గుర్తించడం, తాత్కాలిక రక్షణ చర్యలు చేపట్టడం వరకే పరిమితమవుతున్నారు. ఇప్పటికైన ఉన్నతాధికారులు వెంటనే స్పందించి ప్రమాదక రహదారుల్లో(చప్టాల) స్థానంలో నూతన వంతెనలు నిర్మించాలని పలు గ్రామాల ప్రజలు కోరుతున్నారు.



కల్లూరు టు లక్ష్మీపురం రహదారిపై నీటి ప్రవాహాన్ని పరిశీలిస్తున్న అధికారులు (ఫైల్ ఫోటో)



మంత్రికి పుష్పగుచ్ఛం అందించి అభినందిస్తున్న నాయకులు

మంత్రి వివేక్‌ను కలిసిన మాల నాయకులు

సత్తుపల్లి, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రమంత్రిగా ఇటీవల ప్రమాణ స్వీకారం చేసిన చెన్నూరు ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామిని సత్తుపల్లి మాల మహానాడు నాయకులు సోమవారం హైదరాబాద్‌లో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మంత్రికి పూష్పగుచ్ఛం అందజేసిన నాయకులు శాలువాలతో ఆయనను ఘనంగా సన్మానించారు. అనంతరం మాట్లాడుతూ.. సత్తుపల్లి నియోజకవర్గంతో పాటు రాష్ట్ర అభివృద్ధిలో తనదైన ముద్ర వేసి ప్రజల అభ్యున్నతికి కృషి చేయాలని మంత్రిని నాయకులు కోరారు. బల్లెం చిరంజీవి, పిల్లి సురేష్, కోపల్లి రత్తయ్య, డాక్టర్ సురేష్ రామాల, పిల్లి వెంకటేశ్వర్లు, కటుకూరి కృష్ణ, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

దివ్యాంగులకు కృత్రిమ కాళ్లు



కృత్రిమ కాళ్లు అమర్చిన దివ్యాంగులతో ఎస్ఐ రామారావు

వైరా, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలో రోడ్డు ప్రమాదాలు, అనారోగ్య పరిస్థితుల వల్ల కాళ్లు కోల్పోయిన ఆరుగురు దివ్యాంగులకు వైరా ఎస్ఐ పుష్పాల రామారావు చొరవతో ఆధునాతన కృత్రిమ కాళ్లను అమర్చారు. ఏపీలోని మంగళగిరిలో రోటరీ క్లబ్ ఆఫ్ మంగళగిరి, రోటరీ క్లబ్ ఆఫ్ జూబ్లీహిల్స్ సౌజన్యంతో నిర్వహించిన ఉచిత క్యాంపు సందర్భంగా నిర్వాహకులతో ఎస్ఐ రామారావు సంప్రదించి దివ్యాంగులకు కృత్రిమ కాళ్లను అమర్చేలా కృషిచేశారు. కామేపల్లి మండలంలోని తాళ్లూరి జనార్ధన్, కారేపల్లి మండలంలోని గుగులోతు సాలి, ఖమ్మం రూరల్ మండలం చింతపల్లికి చెందిన కుక్కా బాబు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ములకలపల్లి మండలంలోని కారం గంగరాజు, పాల్వంచ టౌన్‌కు చెందిన మడుగుల చంద్రకళ, బూర్గంపాడ్ మండలంలోని మేకల కృష్ణార్జున్‌రావుకు కృత్రిమ కాళ్లు అమర్చారు. ఆదివారం ఈ ఆరుగురు ద్వివాంగులు తమ కుటుంబసభ్యులతో కలిసి వైరా వచ్చి ఎస్ఐ రామారావుకు కృతజ్ఞతలు తెలిపారు.

హామీల అమలులో ప్రభుత్వం విఫలం

- భట్టికి రాజకీయ భిక్ష పెట్టింది సీపీఐ
- సీపీఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు



మాట్లాడుతున్న బాగం హేమంతరావు

చింతకాని, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని సీపీఐ జాతీయ సమితి సభ్యులు భాగం హేమంతరావు అన్నారు. సోమవారం చింతకాని మండలంలో ఆ పార్టీ 17వ మహాసభ లచ్చగూడెం గ్రామంలో అమరజీవి బాల నాగేందర్‌రెడ్డి ప్రాంగణంలో నిర్వహించారు. తొలుత మహాసభల ప్రారంభ సూచికంగా ఏర్పాటు చేసిన అరుణ పతాకాన్ని భాగం హేమంతరావు ఆవిష్కరించారు. అమర వీరుల స్మారక స్థూపానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పార్టీ అన్ని వర్గాల ప్రజల కోసం అనునిత్యం పోరాటాలు చేస్తుందన్నారు. కమ్యూనిస్టు పార్టీ పోరాటాల ద్వారానే దేశంలో జమీందారులు, జాగీర్దారులు, పటేల్ పట్వారీ వ్యవస్థలు రద్దయ్యాయన్నారు. కమ్యూనిస్టు పార్టీలు చేసిన పోరాటాలు నేటి యువత తెలుసుకోవాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాటాలు సాగించాలన్నారు. కేంద్ర విధానాలతో దేశంలో నిరుద్యోగం పెరిగిపోతోందన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలు రాష్ట్ర ప్రభుత్వం నేరవేర్చకుంటే రేవంత్‌కు కేసీఆర్‌కు పట్టిన గతే పడుతుందన్నారు. భట్టికు రాజకీయ భిక్ష పెట్టింది సీపీఐ పార్టీనేనన్నారు. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ సత్తా చాటాలన్నారు. అనంతరం పార్టీ నూతన మండల కమిటీను ప్రకటించారు. కార్యదర్శిగా దూసరి గోపాలరావు, సహాయ కార్యదర్శులుగా అబ్బూరి మహేష్, మార్గం శ్రీనుతో పాటు 48 మందితో నూతన కమిటీను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో నాయకులు జమ్ముల జితెందర్‌రెడ్డి, కొండపర్తి గోవిందరావు, ఏపూరి రవీంద్రబాబు, సింగు నరసింహరావు, మేకల నరసింహరావు, సీతామాలక్ష్మి, పావులూరి మల్లికార్జున్‌రావు, దూసరి శ్రీరాములు, రాసాల మెహన్‌రావు పాల్గొన్నారు.

వైరా ఏఎంసీలో మిర్చి కొనుగోళ్లు ప్రారంభించిన ఎమ్మెల్యే

- అర్హులందరికీ సంక్షేమ పథకాలు: ఎమ్మెల్యే



మిర్చి కొనుగోళ్లను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రాందాస్ నాయక్

వైరా, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): వైరా వ్యవసాయ మార్కెట్ యార్డులో మిర్చి కొనుగోళ్లను స్థానిక ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్ సోమవారం రాత్రి ప్రారంభించారు. గడిచిన వ్యవసాయ సీజన్‌లోని మిర్చిని రైతులు మార్కెట్‌యార్డులో ఏర్పాటు చేసిన కేంద్రంలో విక్రయించుకోవాలని ఎమ్మెల్యే సూచించారు. కొనుగోలు వ్యాపారులతో ఆయన చర్చించారు. వైరా మార్కెట్‌యార్డులో విధిగా మిర్చి కొనుగోళ్లు చేయాలని వ్యాపారులకు సూచించారు. జిల్లా మార్కెటింగ్‌శాఖ ఏఈ అలీం, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, రాష్ట్ర మార్క్‌ఫెడ్ మాజీ వైస్‌చైర్మన్ బొర్రా రాజశేఖర్, టీపీసీసీ ప్రధాన కార్యదర్శులు కట్ల రంగారావు, నూతి సత్యనారాయణ, ఆత్మకమిటీ చైర్మన్ కోసూరి శ్రీనివాసరావు, మునిసిపల్ మాజీ చైర్మన్ సూతకాని జైపాల్, ఏఎంసీ మాజీ చైర్మన్‌లు గుమ్మా రోశయ్య, బీడీకే.రత్నం, ప్రాజెక్టు కమిటీ మాజీ చైర్మన్ దొడ్డా పుల్లయ్య, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు ఏదునూరి సీతరాములు, నాయకులు వడ్డే నారాయణ, ధార్న రాజశేఖర్, పమ్మి అశోక్, శీలం చంద్రశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఏన్కూరు, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గార్లఒడ్డు ప్రాథమిక పాఠశాలను సోమవారం వైరా ఎమ్మెల్యే మాలోతు రాందాసనాయక్ సందర్శించారు. సొసైటీ చైర్మన్ శెట్టిపల్లి వెంకటేశ్వరరావు వినతి మేరకు ఎమ్మెల్యే గార్లడ్డు గ్రామానికి రాగా పలు సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. అంగన్‌వాడీ కేంద్రానికి నూతనభవనం, ప్రాథమిక పాఠశాలకు ప్రహరీ నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని కోరారు. స్పందించిన ఎమ్మెల్యే సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటాన్నారు. సంబంధిత అధికారులతో మాట్లాడారు. ఈ సందర్భంగా గ్రామంలో అర్హులైన పేదలకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని ఎమ్మెల్యేను కోరారు. మార్కెట్ కమిటీమాజీచైర్మన్ లాలునాయక్, ఆనందరావు, రమణ, రవి, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

భూదాన్ భూమిని తిరిగి అప్పగించండి

- దళితుల మొర

ఏన్కూరు, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): ఆక్రమణకు గురైన భూదాన్ భూమిని తిరిగి తమకు అప్పగించాలని సోమవారం మేడేపల్లి రెవెన్యూ సదస్సులో ఏన్కూరుకు చెందిన బాధిత దళితులు డిప్యూటీ తహసీల్దార్ జి.కిరణ్‌కు మొరపెట్టుకున్నారు. బాధితుల వారసులు కొరకొప్పులు రాంబాబు, సీతారాములు, శ్రీను తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి 1950లో మేడేపల్లి సర్వేనెంబరు 76లోగల 9.20 ఎకరాల మెట్ట భూమిని ఏన్కూరుకు చెందిన కొరకొప్పులు బుచ్చయ్య, కంచెపోగు వెంకయ్యకు భూదాన్ భూమిని ప్రభుత్వం అప్పగించింది. అట్టి భూమిని కొన్నేళ్లకిత్రం భూస్వాములు ఆక్రమించారు. ఆక్రమించిన భూమిని అక్రమ పద్ధతుల్లో పట్టా చేయించుకున్నారని బాధితులు వాపోతున్నారు. ఎన్నిసార్లు అధికారులకు దరఖాస్తు చేసినా ఫలితం లేదని వారు తెలిపారు. అట్టి భూమిని భూస్వాములు క్రయం పొందినట్టు, రికార్డుల్లో అక్రమ పద్ధతిలో ఎక్కించుకుని అనుభవిస్తున్నారని ఆరోపించారు. భూభారతితో అయినా సమస్యను పరిష్కరిచాలని కోరారు.

స్వచ్ఛ మిత్రులను కార్మికులుగా గుర్తించాలి

తల్లాడ, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేసే స్వచ్ఛ మిత్రులను ప్రభుత్వం కార్మికులుగా గుర్తించి వ్యక్తిగత ఖాతాల్లో వేతనాలు జమచేయాలని కోరుతూ సోమవారం స్థానిక మండల వనరుల కేంద్రం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈవో ఎస్.దామోదరప్రసాద్‌కు వినతిపత్రం అందించారు. కనీస వేతనం ఇవ్వాలన్ని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వేతనాల కోసం రోజుల తరబడి చూడాల్సి వస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో స్వచ్ఛమిత్ర సంఘం నాయకులు తేళ్లపుట్ట ఏసు, గోపాలరావు, శివకృష్ణ, రమేష్, తెనాలి ఝాన్సీ, చిన్నమ్మ, మౌనిక, రాధ, మరియమ్మ, సంధ్యారాణి పాల్గొన్నారు.

తల్లాడలో సాంస్కృతిక కార్యక్రమాలు

తల్లాడ, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో చదివితే కలిగే ప్రయోజనాలు, కల్పించే సౌకర్యాలు, డ్రాపౌవుట్ విద్యార్థులను పాఠశాలల్లో చేర్పించే విధంగా అవగాహన కలిపిస్తూ సోమవారం తల్లాడ హైస్కూల్‌లో తెలంగాణ సాంస్కృతిక సారధి కె.జాన్ కళాబృంధం ఆధ్వర్యంలో సాంస్కృతిక ప్రదర్శణలు నిర్వహించారు. ఎంఈవో దామోదరప్రసాద్, హెచ్ఎం వెంకటేశ్వరరావు, కళాకారులు ఎస్.సుధాకరరావు, కొమ్ము రమేష్ పి.లక్ష్మయ్య, కె.జ్యోతి పాల్గొన్నారు.

అంగన్వాడీ పిల్లలకు స్కూల్ సామగ్రి వితరణ

కల్లూరు, జూన్16 (ఆంధ్రజ్యోతి): కల్లూరు మండల పరిధిలోని ఎర్రబోయినపల్లి గ్రామంలో సోమవారం పోట్రు లక్ష్మయ్య చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఫ్రీగా స్కూల్ సామాగ్రి వితరణ చేశారు. నాలుగు అంగన్వాడి కేంద్రాల్లో ట్రస్టు తరుపున దాతలు పోట్రు కిరణ్ తమ వంతుగా పిల్లలకు బ్యాగులు, పలకలు, పెన్సిల్స్‌ను పంపిణి చేశారు. అంగన్వాడి కేంద్రాల్లో పిల్లలకు విద్యను అందిచడంతోపాటు నాణ్యమైన పోషక ఆహారం అందించటం జరుగుతుదన్నారు. రామకృష్ణ, టీచర్స్ తల్లులు పాల్గొన్నారు.

టీబీ పరీక్షలు తప్పనిసరిగా చేయించుకోవాలి

- జిల్లా టీబీ నిర్మూలనాధికారి సుబ్బరావు



మాట్లాడుతున్న సుబ్బారావు

ఏన్కూరు, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): టీబీ వ్యాధి లక్షణాలున్న ప్రతి ఒక్కరూ పరీక్షలు తప్పనిసరిగా చేయించుకుని మందులు వాడినట్లయితే వ్యాధి పూర్తిగా నయమవుతుందని జిల్లా టీబీ నిర్మూలన అధికారి సుబ్బారావు తెలిపారు. సోమవారం జన్నారం ఎస్టీ, బీసీ కాలనీల్లో ప్రధానమంత్రి టీబీ ముక్త్‌భారత్ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు . ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆరునెలలు ప్రభుత్వం ఉచితంగా ఇచ్చే మందులను వాడితే వ్యాధి పూర్తిగా నయమవుతుందన్నారు. అనంతరం పీహెచ్‌సీ వైద్యులు రాములు మాట్లాడుతూ.. వ్యాధి లక్షణాలపై అవగాహన కలిపించారు. ఈ సందర్భంగా టీబీ వ్యాధి లక్షణాలున్న 114మంది నుంచి శాంపిల్స్ సేకరించారు. ఈ కార్యక్రమంలో టీబీ నోడల్ అధికారి ఏ.పద్మ, పంచాయతీ కార్యదర్శి అనూష; టీబీ చికిత్స సూపర్‌వైజర్ వై.సురేష్, టీబీ ల్యాబ్ సూపర్‌వైజర్ ఆర్.సంజీవ్‌కుమార్, నర్సింగ్ ఆఫీసర్స్ డి.సాయికుమార్, బి.చిన్న, టీబీ అలర్ట్ ఇండియా ప్రోగ్రాం కో ఆర్డినేటర్ ప్రభాకర్, ఏఎన్ఎంసునిత తదితరులు పాల్గొన్నారు.

'బడిబాట'తో బాలలకు భవిత



విద్యార్థులకు నోట్‌పుస్తకాలు అందిస్తున్న ఎంఈవో

ఎర్రుపాలెం, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదు పెంచేందుకు విద్యాశాఖ ప్రతిష్ఠాత్మకంగా బడిబాట కార్యక్రమం ప్రారంభించింది. ఈ బడిబాటతో బాలల భవితకు పునాది పడుతుందని ఎంఈవో మురళీమోహన్‌రావు అన్నారు. మండలంలోని వెంకటాపురం గ్రామంలో సోమవారం ఉపాధ్యాయుడు వెల్లంకి నాగరాజు ఆధ్వర్యంలో బడిబాట కార్యక్రమం నిర్వహించారు. దీనిలో భాగంగామెడికల్ అసోసియేషన్ అధ్యక్షడుఉ కర్నాటి సుధాకర్‌రెడ్డి సహకారంతో రూ.12వేల విలువగల నోటు పుస్తకాలు, పెన్నులను అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జూన్ 6నుంచి 19వరకు వినూత్న కార్యక్రమాలతో బడిబాట ప్రత్యేక డ్రైవ్ ఏర్పాటుచేసి విద్యార్థుల తల్లిదండ్రులు, స్థానిక ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలు, ఉపాధ్యాయుల భాగస్వామ్యంతో అన్ని గ్రామాల్లో బడిబాట నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఒకేరోజు 40మంది ప్రభుత్వపాఠశాలకు విద్యార్థులను నమోదుచేసిన హెచ్ఎం నాగరాజును అభినందించారు. ఉపాధ్యాయులు ఆర్.రామారావు, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ నిర్మల, సొసైటీ ప్రెసిడెంట్ వెన్నపూస కృష్ణారెడ్డి, గ్రామస్తులు బొగ్గుల గోవర్ధన్‌రెడ్డి, వేముల వెంకటేశ్వరరావు, స్వర్ణ నాగేశ్వరరావు, నాగిరెడ్డి, శ్రీను పాల్గొన్నారు.

అన్నదాతల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం

- వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న అధికారులు, రైతులు



విడియోకాన్ఫెరెన్స్‌లో మాట్లాడుతున్న రేవంత్‌రెడ్డి

వైరా, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): రైతుల అభివృద్ధి, సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క పేర్కొన్నారు. రైతువేదికల్లో వీడియోకాన్ఫరెన్స్ అనుసంధానాన్ని సీఎం రేవంత్‌రెడ్డి సోమవారం ప్రారంభించారు. సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వీడియో కాన్ఫెరెన్స్‌లో ప్రసంగించారు. వైరా తహసీల్దార్ కేవీ.శ్రీనివాసరావు, ఏవో మయాన్ మంజూఖాన్, ఏఈవోలు ఎస్.సైదులు, వెంకటనర్సయ్య, రాజేష్, వాసంతి, దీప్తి, పంచాయతీ కార్యదర్శి వెంకటరమణ పాల్గొన్నారు.

తల్లాడ, జూన్ 16(ఆంధ్రజ్యోతి): తల్లాడ మండలం మల్లవరం గ్రాంమలోని రైతువేదికలో సోమవారం రైతునేస్తం కేంద్రాన్ని కల్లూరు ఆర్డీవో రాజేంద్రగౌడ్ లాంఛనంగా ప్రారంబించారు. ఈ సంరద్భంగా ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ యూనివర్శిటీ నుంచి సీఎం రేవంత్‌రెడ్డి పాల్గొని రైతులతో ముఖాముఖి , వ్యవసాయశాస్త్రవేత్తల సలహాలు, సూచనలను ప్రత్యక్ష ప్రసార కార్యక్రమం ద్వారా తిలకించారు. తహసీల్దార్ వి.సురేష్‌కుమార్, ఏవో ఎండీ తాజుద్దీన్, సొసైటీచైర్మన్ తూము వీరభద్రరావు, ఏఈవోలు పాల్గొన్నారు.

కల్లూరు, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన రైతునేస్తం వీడియో కాన్ఫరెన్స్ కార్యక్రమం సోమవారం కల్లూరు, ముచ్చవరం రైతువేదికల్లో ఘనంగా ప్రారంభమైంది. ఈ కార్యక్రమాన్ని కల్లూరు ఏఎంసి చైర్మన్ బాగం నీరజదేవి, తహసీల్దార్ సాంబశివుడు, ఎంపీడీవో చంద్రశేఖర్‌లు ప్రారంభించారు. వ్యవసాయ సాగులో రైతులు పాటించాల్సిన యాజమన్య పద్ధతులపై శాస్త్రవేత్తలు వివరించారు. ఏవో శ్రీనువాసరావు, కాంగ్రెస్ నాయకులు మాదిరాజు అన్నమరాజు, తక్కెళ్లపాటి ప్రసాద్, భూక్యా శివకుమార్‌నాయక్, ఆళ్ల నరిసింహారావు, ఏఈవోలు దీపిక, పవన్‌కళ్యాణ్, పలువురు రైతులు పాల్గొన్నారు.

బోనకల్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ముష్టికుంట్ల, బోనకల్, చిన్నబీరవల్లి గ్రామాల్లో గల రైతు వేదికల్లో సోమవారం రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించిన రైతునేస్తం విడియో కాన్ఫరెన్స్‌కు అధికారులు, రైతులు హాజరయ్యారు. బోనకల్‌లో ఏడీఏ స్వర్ణ విజయ్‌చంద్ర, ఆత్మ కమిటీ చైర్మన్ కర్నాటీ రామకోటేశ్వరరావు, ఏవో పి. వినయ్ కుమార్‌లు, ముష్టికుంట్ల రైతువేదికలో తహసీల్దార్ ఎం. రమాదేవి, చిన్నబీరవల్లిలో ఎంపీడీవో ఆర్. రమాదేవి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గాలి దుర్గారావు, చేబ్రోలు వెంకటేశ్వర్లు, బీవీ నాయక్ పాల్గొన్నారు.

చింతకాని, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని నాగులవంచ, చింతకాని, లచ్చగూడెం గ్రామాల్లోని రైతువేదికల్లో సోమవారం రైతునేస్తం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆన్‌లైన్ ప్రసారమైన సీఎం ప్రసంగాన్ని ఆన్‌లైన్ ద్వారా రైతులు వీక్షించారు. కార్యక్రమంలో తహసీల్దార్ అనంతరాజు, ఎంపీడీవో శ్రీనివాసరావు, ఏవో మానస, ఆత్మ డైరక్టర్‌లు కొప్పుల గోవిందరావు, తూము కోటేశ్వరరావు, రైతులు కొల్లి గోవిందరావు, పెంట్యాల అప్పారావు, గొడుగు రమేష్, శ్రీరాముల నాగేశ్వరరావు పాల్గొన్నారు.

విజయవంతంగా ముగిసిన మజ్జిగ పంపిణీ కార్యక్రమం

- దాతల సహకారం మరవలేనిది: డీఎం



మజ్జిగ పంపిణీ చేస్తున్న ఆర్టీసీ డిపో మేనేజర్ రాజ్యలక్ష్మి, ఏఎంసి చైర్మన్ నీరజదేవి

కల్లూరు, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ ప్రయాణికులకు దాతల సహకారంతో అందిస్తున్న ఉచిత మజ్జిగ పంపిణి మరవలేనిదని సత్తుపల్లి ఆర్టీసీ డిపో మేనేజర్ యు రాజ్యలక్ష్మీ అన్నారు. కల్లూరు ఆర్టీసీ బస్టాండులో గత మూడు నెలలుగా దాతల సహకారంతో తలపెట్టిన ఉచిత మజ్జిగ పంపిణి కార్యక్రమం సోమవారంతో విజయవంతంగా ముగిసింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ముగింపు కార్యక్రమంలో డిపో మేనేజర్ రాజ్యలక్ష్మీ, ఏఎంసి చైర్మన్ బాగం నీరజదేవిలు ముఖ్యఅతిథిలుగా విచ్చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నూతన బస్టాండులో దాతల సహకారంతో గత నాలుగు సంవత్సారాలుగా వేసవి సీజన్‌లో ఉచితంగా మజ్జిగ, ఓఆర్ఎస్ ప్యాకెట్లు ప్రయాణికులకు అందించటం అభినందనీయమన్నారు. ఉచిత మజ్జిగ పంపిణీలో కల్లూరు ప్రాంత ప్రజలు ఆదర్శంగా నిలిచారన్నారు. ఆర్టీసీ సంస్థ ప్రయాణికులకు పలు విధాలుగా స్కీమ్‌లు అందిస్తుందన్నారు. ప్రతి ఒక్కరు ఆర్టీసీని ఆదరించాలని ఇదే సహకారంను నిరంతరం అందించాలని వారు కోరారు. ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించటంలో ముందున్న సత్తుపల్లి ఆర్టీసీ డిపో మేనేజర్ రాజ్యలక్ష్మితోపాటుగా సిబ్బంది కృషి అభినందనీయమన్నారు. ఇంత మంచి కార్యక్రమాన్ని దాతలను సంప్రదించి విజయవంతం చేసిన విలేజ్ బస్ ఆఫీసర్ కిన్నెర ఆనందరావు కృషిని అభినందిస్తూ ఆయన శాలువతో ఘనంగా సన్మానించారు. ఇలాంటి మంచి కార్యక్రమాలు చేపట్టి కల్లూరు బస్టాండు ఆదర్శంగా నిలిచిందన్నారు. ఈ నెల 27న మద్ది, ద్రాక్షారామం, ద్వారకా తిరుమల, వాడపల్లి, పెనుగొండ దేవాలయాలకు ఒక రోజు దర్శనం కోసం ట్రిప్ కేవలం రూ.1000తో బస్సులు ఏర్పాటు చేయటం జరిగిందని డిపో మేనేజర్ రాజ్యలక్ష్మి చెప్పారు. చివరి రోజు సందర్భంగా డిపో మేనేజర్ రాజలక్ష్మి, ఏఎంసి చైర్మన్ నీరజదేవిలు ప్రయాణికులకు మజ్జిగ పంపిణి చేశారు. మునిసిపాలిటి మేనేజర్ ఎన్ నాగేశ్వరరావు, కాంగ్రెస్ నాయకులు మాదిరాజు అన్నమరాజు, తక్కెళ్లపాటి ప్రసాద్, బాగం ప్రభాకరచౌదరి, భుక్యా శివకుమార్‌నాయక్, ఆళ్లకుంట నరిసింహారావు, పొన్నూరు వెంకటేశ్వరరావు, లైన్స్ క్లబ్ అధ్యక్షుడు చలువాది నగేష్ గంగుల నారాయణరావు పాల్గొన్నారు.

మార్కెట్ కమిటీ ద్వారా రైతులకు విస్తృత సేవలు

మధిరరూరల్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): మధిర వ్యవసాయ మార్కెట్ యార్డులో సోమవారం మిర్చి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. మార్కెట్ కమిటీచైర్మ న్ బండారు నరసింహారావు ఆధ్వర్యంలో జరిగిన కొనుగోలు కేంద్రాన్ని డీసీసీబీ జిల్లా చైర్మన్ దొండపాటి వెంకటేశ్వరరావు చేతులమీదుగా ప్రారంభించారు. ఈసందర్భంగా మార్కెట్ చైర్మన్ నరసింహారావు మాట్లాడుతూ.. మార్కెట్ కమిటీ ద్వారా రైతులకు విస్తృత సేవలు అందిస్తున్నట్టు తెలిపారు. మిరప కొనుగోలు కేంద్రాన్ని రైతులు సద్వినియోగించుకోవాలన్నారు. కమిటీ సెక్రటరీ వాకాచంద్రశేఖరరావు, వైస్‌చైర్మన్ అయిలూరిసత్యనారాయణరెడ్డి, మార్కెట్ కమిటీడైరెక్టర్లు,కాంగ్రెస్, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

మంత్రి పొంగులేటిని కలిసిన నాయకులు

ఏన్కూరు, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డిని సోమవారం ఖమ్మం క్యాంపు కార్యాలయంలో ఏన్కూరు మండల కాంగ్రెస్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భగా మండల సమస్యలను మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధంగా ఉండాలని, అందరు కలిసికట్టుగా ఐక్యంగా అభ్యర్థల గెలుపు కోసం కృషిచేయాలని మంత్రి సూచించినట్టు తెలిపారు. మంత్రిని కలిసిన వారిలో మాజీ ఎంపీపీ ముక్తి వెంకటేశ్వర్లు, మండల నాయకులు గిద్దగిరి సత్యనారాయణ, నల్లమల శివకుమార్ పాల్గొన్నారు.

పది ర్యాంకర్లకు నగదు ప్రోత్సాహకాల పంపిణీ



నగదు ప్రోత్సాహకాన్ని అందజేస్తున్న శైలజారాణి

వైరా, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సిరిపురం హైస్కూల్లో ఈ ఏడాది మార్చిలో జరిగిన పదోతరగతి పరీక్షల్లో అత్యుత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు తన భర్త కందిబండ బాలమురళీకృష్ణ జ్ఞాపకార్థం ఆయన సతీమణి శైలజారాణి, కుమారులు రూ.22వేల నగదు ప్రోత్సాహకాలను సోమవారం అందజేశారు. మొదటిస్థానం సాధించిన గుమ్మా నిరంజన్‌కు రూ.11వేలు, ద్వితీయ స్థానం సాధించిన యంగల హర్షకు రూ.ఐదువేలు, మూడోస్థానం సాధించిన కూరాకుల అలేఖ్యకు రూ.4వేలు, నాల్గోస్థానం సాధించిన పూజల నాగవైష్ణవికి రూ.2వేలు నగదు ప్రోత్సాహకాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు సూర్యకుమారి, గ్రామస్థులు ఇతరులు పాల్గొన్నారు.